

బీఎంటీసీలోనూ యూపీఐ సేవలు

విజయపుర, ఏప్రిల్ 20: బీఎంటీసీ బస్సుల్లో ప్రయాణికులకు చిల్లర సమస్యను పరిష్కరించే దిశగా యూపీఐ సేవలను అందుబాటులోకి తెచ్చారు. బీఎంటీసీ విమానాశ్రయ వజ్ర సర్వీసులకే పరిమితమైన యూపీఐ సేవలను ప్రస్తుతం రెగ్యులర్ బస్సులలోనూ అమలు చేస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, భీమ్ యూపీఐ సేవలను కల్పించేలా స్కానర్‌ను అందుబాటులోకి తెచ్చారు. స్కాన్ చేయడం ద్వారా టిక్కెట్ చార్జీలు చెల్లించే సదుపాయం వచ్చిందని 39వ డిపో విజయపుర - హొస్కోటె రూట్ అధికారి తిప్పణ్ణ వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బెంగళూరు రూపురేఖలు మార్చాం



ప్రధానికి బీజేపీ నేతల సత్కారం



- నాడు 17 కి.మీ. మెట్రో.. నేడు 70 కి.మీ.
- నగరానికి త్వరలో బుల్లెట్ ట్రైన్
- కాంగ్రెస్ రైతు వ్యతిరేకి ● అధికారమే 'ఇండియా కూటమి' ధ్యేయం
- హెచ్‌ఏఎల్‌పై దుష్ప్రచారం చేశారు
- వారి పాలనలో బాంబులు పేలుతాయి.. బాలికలపై దౌర్జన్యాలు పెరుగుతాయి..
- విజయసంకల్ప యాత్రలో ప్రధాని మోదీ

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ డబుల్ ఇంజన్ పాలనలో బెంగళూరు రూపు రేఖలు మార్చామని, సిలికాన్ సిటీ డిజిటల్ ఇండియాకు కేంద్ర బిందువైందని, త్వరలో నగరానికి బుల్లెట్ ట్రైయిన్ రానుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. బెంగళూరు నగర పరిధిలోని నాలుగు లోక్‌సభ స్థానాల పరిధి ప్యాలెస్ మైదానంలో జరిగిన శనివారం విజయసంకల్ప ప్రచారసభలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు డిజిటల్ ఇండియాను కాంగ్రెస్ వ్యతిరేకించిందని, ఇప్పుడు బెంగళూరు సాంకేతికతకు కేంద్రబిందువైందన్నారు. 2014కు ముందు నమ్మ మెట్రో 17 కిలోమీటర్లు ఉండేదని, ఇప్పుడు 70 కిలోమీటర్లు అధిగమించిందన్నారు. సిలికాన్ సిటీలో సబర్బన్ ప్రాజెక్టు ప్రారంభమైందని శాటిలైట్ టౌన్ రింగ్‌రోడ్డు లభించనుందన్నారు. ఇక్కడి విమానాశ్రయం ప్రపంచవ్యాప్తంగా చర్చకు వేదిక అవుతోందన్నారు. త్వరలోనే మేడ్ ఇన్ ఇండియా విమానాల్లో ప్రజలు ప్రయాణిస్తారని అభిప్రాయపడ్డారు. హెచ్‌ఏఎల్‌ను అన్యాయం చేస్తున్నారంటూ గోబెల్ ప్రచారం చేశారని, కానీ అత్యధిక పనుల కేటాయింపు హెచ్‌ఏఎల్‌కే దక్కాయన్నారు. బెంగళూరు యువశక్తి, సాంకేతికత పవర్‌హౌస్ కాగా కాంగ్రెస్ సాంకేతికతకు వ్యతిరేకమన్నారు. కొవిడ్ వ్యాక్సిన్ విషయంలోనూ వ్యతిరేకంగా మాట్లాడారన్నారు. మోదీ ప్రభుత్వం భారత భవిష్యత్తుకోసం ఉత్తమమైన పథకాలు కలిగి ఉన్నాయన్నారు. భారత్ గ్లోబల్ ఆర్థికవ్యవస్థకు హబ్ కానుందని, ఉద్యోగాలు లభించనున్నాయని, ఫార్మా హబ్, ఎలక్ట్రికల్ వెహికల్ హబ్, గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ కానుందన్నారు. 5జీ తర్వాత 6జీ రానుందని, చంద్రయాన్ తర్వాత గగనయాన్ సాధ్యమవుతుందన్నారు. మోదీ ఇటువంటి పథకాలు తీసుకొస్తున్నారని ప్రపంచమే భారత్‌వైపు చూసేలా అభివృద్ధి చేస్తున్నారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం మోదీని ఓడించాలని చూస్తోందన్నారు.

- కాంగ్రెస్ రైతు వ్యతిరేకి అనేది ప్రస్తుత ప్రభుత్వం నిరూపించిందన్నారు. రైతులకు ఇస్తున్న 4 వేల రూపాయలను రద్దు చేసి అన్నదాతలకు అన్యాయం చేసిందన్నారు. వారికి ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. కాంగ్రెస్ యువతకు, పెట్టుబడుల సాధనకు వ్యతిరేకమన్నారు. అధికారం ఆశ కోసం 'ఇండియా' కూటమి ఏర్పాటు చేసుకున్నారని వారికి నాయకుడే లేడని, భవిష్యత్తు ఆలోచనలు లేవన్నారు. కాంగ్రెస్ పాలనతో ఎక్కడ చూసినా అవినీతి తాండవిస్తోందన్నారు. గతంలో ఆర్థికసంక్లిష్టతతో బ్యాంకులు మునిగిపోయే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం బ్యాంకులు ఎందరినో ఆదుకునేలా చేశామన్నారు. కాంగ్రెస్ నుంచి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇక్కడ బాంబులు పేలుతాయని, బాలికలపై దౌర్జన్యాలు సాగుతాయని, భజనలు చేస్తే చితకబాదుతారని ఇటీవల జరిగిన సంఘటనలను గుర్తు చేశారు.
- మీరు పదేళ్లక్రితం వేసిన ఓటుతో దేశం ఏ విధంగా అభివృద్ధి చెందిందో రికార్డులతో వచ్చానని వీటిని కాంగ్రెస్ సహించలేకపోతోందన్నారు. 2014లో దేశం ఆర్థికంగా వెనుకబడి ఉండేదని, ప్రస్తుతం ప్రపంచస్థాయిలో పోటీ పడేలా ఉన్నామన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని కొనియాడారు.

పదేళ్లలో పేదరికం తగ్గింది ..

చిక్కబళ్లాపురలో జరిగిన బహిరంగసభలో ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతూ ఇటీవల పదేళ్లలో దేశంలో పేదరికం తగ్గిందన్నారు. 25 కోట్లమంది బీపీఎల్ కంటే మెరుగయ్యారన్నారు. 3 కోట్ల ఇళ్లు నిర్మించామన్నారు. బుడకట్టు సామాజికవర్గానికి చెందిన మహిళకు రాష్ట్రపతి అవకాశం కల్పించామని, అంబేడ్కర్ పేరిట ఐదు స్థలాల్లో పంచతీర్థగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కొన్ని శక్తులు మోదీని అధికారం నుంచి దించాలని కుట్ర పన్నుతున్నాయని, నారీశక్తి, మాతృశక్తి ఆశీస్సులు తనకే ఉన్నాయన్నారు. అత్యంత అనుభవం కల్గిన రాజకీయ నేత, దేశ అభివృద్ధిని ఆకాంక్షిస్తున్న దేవెగౌడ ఎన్డీయే కూటమిలో చేరారన్నారు. రెండు బహిరంగ సభల్లోనూ ప్రధాని స్థానికులను ఆకట్టుకునేలా కన్నడలో ప్రసంగాన్ని ప్రారంభించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య కైవార తాతయ్య వంటి సాధకులను స్మరించుకున్నారు. ఈనెల 26న జరిగే పోలింగ్‌లో విశేషంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. చిక్కబళ్లాపురసభలో అభ్యర్థులు డాక్టర్ సుధాకర్, మల్లేశ్‌బాబు, ఎంపీ మునిస్వామి, ఎమ్మెల్సీ చలవాది నారాయణస్వామితోపాటు పలువురు పాల్గొన్నారు. ఇక బెంగళూరు ప్యాలెస్ గ్రౌండ్స్ సభలో అగ్రనేత యడియూరప్ప, అభ్యర్థులు తేజస్వి సూర్య, పీసీ మోహన్, డాక్టర్ మంజునాథ్, శోభాకరంద్లాజె, ప్రతిపక్షనేత అశోక్, జేడీఎస్ యువనేత నిఖిల్‌కుమారస్వామి, ఎంపీ సదానందగౌడ, మాజీ మంత్రి మునిరత్న, ఎమ్మెల్యే రఘు, మునిరాజు, నందీశ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.



నాడు ఖాళీ చెంబు ఇచ్చింది కాంగ్రెస్సే : దేవెగౌడ



బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకను ఖాళీ చెంబుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ ప్రధాని దేవెగౌడ విరుచుకుపడ్డారు. శనివారం చిక్కబళ్లాపురలో ప్రధాని సభలో పాల్గొన్న దేవెగౌడ మీడియాతో మాట్లాడుతూ 2014లో ఖాళీ చెంబు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, దీన్ని అక్షయపాత్రగా మార్చింది నరేంద్రమోదీ అన్నారు. రెండు రోజులుగా రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ కేంద్రం నుంచి కర్ణాటకకు ఖాళీ చెంబు ఇచ్చిందనే ప్రకటనలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియాగాంధీ యూపీఏ కూటమి అధ్యక్షురాలిగా ఉన్నప్పుడు కోల్గేట్, 2జీ స్పెక్ట్రమ్ వంటి అవినీతి బహిరంగమైందన్నారు. దేశసంపదను లూటీ చేసి ఖాళీ చెంబు చేశారన్నారు. పదేళ్లలో ఖాళీ చెంబు అక్షయపాత్రగా మారిందన్నారు. సీఎం, డీసీఎంలకు సిగ్గు ఉండాలన్నారు. పేదలకు ఉద్యోగాలు కల్పించేందుకు ఎన్ని కార్యక్రమాలు చేశారని ప్రశ్నించారు. పదేళ్లలో కనీసం ప్రతిపక్ష స్థానంలో కూర్చునే అర్హత కూడా కాంగ్రెస్ పార్టీ సాధించలేకపోయిందని, అయినా ఏదో సాధించినట్లు విర్రవీగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష స్థానానికి 10శాతం సీట్లు సాధించలేనివారు విమర్శలు చేయడమా అని ప్రశ్నించారు. ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా రామకృష్ణ హెగ్డేపై పిళ్లప్పను పోటీ చేయించి గెలిపించానని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో 28 స్థానాల్లో ఎన్డీయే అభ్యర్థులను గెలిపించి మరోసారి మోదీని ప్రధాని చేయడమే లక్ష్యమన్నారు.



ప్రధాని సభకు హాజరైన జనం, ఉత్సాహంగా మహిళా కార్యకర్త



ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- 150 రోజుల తర్వాత బెంగళూరులో కురిసిన వాన
- ఆరు దశాబ్దాలలో ఇదే సుదీర్ఘం

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరులో సుదీర్ఘకాలం తర్వాత వాన కురిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా నగరవ్యాప్తంగా దాదాపు 40 రోజులనుంచి 35-39 డిగ్రీల సెల్సియస్ దాకా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలలు, వేడిగాలులతో నగర ప్రజలు తల్లడిల్లారు. అయితే శుక్రవారం రాత్రి నగర పరిధిలోని కెంగేరి, పీణ్యా దాసరహళ్ళి ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. శనివారం మధ్యాహ్నం వివిధ ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. ఆర్‌టీ నగర్, నాగరబావి, మైసూరు రోడ్డు, విజయనగర, నాయండహళ్ళి, హెబ్బాళ, రాజాజినగర్, వైట్‌ఫీల్డ్, వర్తూరు, బెళ్ళందూరు, బొమ్మనహళ్ళి, హెచ్ఎస్ఆర్ లే అవుట్, కోరమంగల, జయనగర్ తదితర ప్రాంతాల్లో వాన కురిసింది. 150 రోజుల తర్వాత నగరంలో వర్షం కురిసినట్లయ్యింది. డిసెంబరులో వాన కురిశాక ఇదే ప్రప్రథమంగా నగరంలో వర్షం నమోదైంది. ఆరు దశాబ్దాల కాలంలో దాదాపు ఐదు నెలల పాటు వర్షం కురవని సందర్భం లేదని వాతావరణ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే మండే ఎండల్లో కాస్త చల్లబడడంతో నగరవాసులు కాస్త హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే రుతుపవనాలు ప్రారంభం కావాలని, లేదంటే ఉక్కపోతలు తప్పవని, వర్షం కోసం ఎదురు చూస్తున్నట్లు అభిప్రాయపడుతున్నారు.

కుమారస్వామికి హైకోర్టులో ఊరట



బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ నేత కుమారస్వామికి హైకోర్టులో ఊరట దక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీలతో గ్రామీణ మహిళలు దారి తప్పుతున్నారన్న కుమార వ్యాఖ్యల నేపథ్యంలో మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసులకు హైకోర్టు స్టే ఇచ్చింది. మహిళా కమిషన్ జారీ చేసిన నోటీసులను రద్దు చేయాలని కుమారస్వామి హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి నాగప్రసన్న ధర్మాసనం ప్రతివాది మహిళా కమిషన్ చైర్మన్ డాక్టర్ నాగలక్ష్మి చౌదరికి అత్యవసర నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ కేసు వాయిదా వేశారు. కుమారస్వామి తరపున న్యాయవాది ఏవీ నిశాంత్ వాదించారు. మహిళా కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసే అవకాశం లేదని కోర్టు దృష్టికి తీసుకురావాల్సి ఉందన్నారు. విచారణ లేదా వివరణ విషయంలో నోటీసులు జారీ చేయాల్సి వస్తే కమిషన్ సెక్రటరీ మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కానీ ఇక్కడ మహిళా కమిషన్ చైర్మన్ నోటీసులు ఇవ్వడంపైగా వారం రోజుల్లో తన ముందు హాజరు కావాలని సూచించడం వంటివి సరి కాదన్నారు. చైర్మన్ ఇలా వ్యవహరించేందుకు చట్టంలో అవకాశం లేదని, నోటీసు రద్దు చేయాలని సూచించారు. ఈనెల 13న ఎన్డీయే అభ్యర్థి సోమణ్ణ తరపున తురువేకెరె ప్రచారసభలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న గ్యారెంటీ పథకాలతో మన గ్రామీణ తల్లులు కొందరు స్వల్పంగా దారి తప్పుతున్నారని, గ్రామీణ మహిళల జీవనం ఏం కావాలని కుమారస్వామి వ్యాఖ్యానించారు. వారికి గ్యారెంటీలు తప్ప మరే అంశం గురించి ఆలోచించరని వ్యాఖ్యానించారు. ఈమేరకు 15వ తేదీన మహిళా కమిషన్ చైర్మన్ నోటీసులు జారీ చేశారు.

పలుసార్లు మందలించా..

- ఫయాజ్ పెళ్లి చేసుకుందామని వేధించాడు..
- ఇష్టం లేదని నేహా ఎన్నోసార్లు తిరస్కరించింది..
- కిరాతకంగా చంపేశాడు..కఠిన శిక్ష పడాల్సిందే
- మీడియాతో తండ్రి నిరంజన్ హిరేమఠ ఆవేదన

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): 'నేహాను వేధిస్తుంటే ఫయాజ్‌ను మందలించా.. నాలుగైదుసార్లు బెదరించాడు.. అతడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చా' అయినా ఘోరం జరిగిపోయిందని హత్యకు గురైన నేహా తండ్రి నిరంజన్ హిరేమఠ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్యకు గురైన నేహా హిరేమఠ కేసుపై ఎఫ్‌ఐఆర్‌లో పలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసిన హీరేమఠ అనంతరం మీడియాతో మాట్లాడారు. నేహాను పెళ్లి చేసుకుందామని ఫయాజ్ వేధించారన్నారు. విషయం తెలిశాక ఫయాజ్ తల్లిదండ్రులకు ఫోన్ చేసి హెచ్చరించానన్నారు. తనకు పెళ్లి ఇష్టం లేదని, చదువుకోవాలని నేహా పలుమార్లు ప్రేమను తిరస్కరించిందన్నారు. అయినా వెంటపడుతున్న ఫయాజ్ నాలుగైదుసార్లు బెదిరించారని, ప్రాణాలు తీస్తామని హెచ్చరించారని ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. కాగా హుబ్బళ్ళిలో నేహా హిరేమఠ హత్యను ఖండిస్తూ జరిగిన నిరసనలో మాజీ మంత్రి బీసీ పాటిల్ పాల్గొన్నారు. ప్రేమించలేనంటూ నేహా తెగేసి చెప్పినా వెంటాడి కిరాతకంగా హత్య చేశాడని అతడికి తగిన శిక్ష పడాల్సిందేనన్నారు. కేసును సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు.



మీడియాతో నిరంజన్ హిరేమఠ

- నేహా హత్యపై ధారవాడ లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థి దింగాలేశ్వరస్వామి హుబ్బళ్ళిలో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు మర్యాద లేకుండా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ విద్యార్థిని హత్యకు గురైతే ఖండించాల్సింది పోయి రాజకీయ అస్త్రంగా వాడుకోవడం సిగ్గు చేటన్నారు. నేహా కుటుంబానికి న్యాయం జరగాలని, మహిళలకు రక్షణ ముఖ్యమన్నారు. బీజేపీ ఈ అంశాన్ని ఎన్నికల అస్త్రంగా ఉపయోగించుకునే నీచానికి దిగిందన్నారు. మానవత్వం లేకుండా ఓ దారుణహత్యను ఉపయోగించుకోవడం తలదించుకోవాల్సిన అంశమన్నారు. ప్రభుత్వం ఏదైనా హత్యలను సాధారణంగా భావించరాదన్నారు. బెంగళూరు, తుమకూరు, హుబ్బళ్ళిలో ఏకకాలంలో హత్యలు జరిగాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకోవాలన్నారు. లవ్ జిహాదీ అయితే నిందితుడికి మరింత కఠిన శిక్ష పడాల్సిందేనన్నారు.

నెలాఖరు నాటికి కామరాజ్ రోడ్డు అందుబాటులోకి..

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కబ్బన్ రోడ్డు నుంచి ఎంజీ రోడ్డును కలిపే కామరాజ్‌రోడ్డు మార్గం నెలాఖరుకు అందుబాటులోకి రానుంది. 2019లో నమ్మమెట్రో పనులకోసం ఈ మార్గాన్ని మూసివేసిన సంగతి విదితమే. రెండురోజులక్రితం కొన్ని బ్యారికేడ్‌లను తొలగించారు. పింక్‌లైన్‌లో అండర్ గ్రౌండ్ ఎంజీ మెట్రో రోడ్డు పనుల ముగింపుదశలో ఉండడంతో బ్యారికేడ్‌లను తీశారు. బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) చీఫ్ పీఆర్‌ఓ యశ్వంత్ చౌహాన్ మాట్లాడుతూ సంచారానికి వీలుగా ప్రక్రియ చేపట్టామన్నారు. నెలాఖరు నాటికి పూర్తయ్యే లక్ష్యం కలిగినట్లు తెలిపారు. కొన్ని ఉపకరణాలు తీసేందుకు చేర్చేందుకు బ్యారికేడ్‌లను తొలగించారన్నారు. కాగా మెట్రో స్టేషన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని బీఎంఆర్‌సీఎల్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మెట్రో స్టేషన్‌కు అవసరమైన ఎలక్ట్రికల్, విన్యాసం, వాస్తు, ఇతర పనులు పూర్తి కావడానికి మరో ఏడాది సమయం పడుతుందన్నారు. పింక్‌లైన్ 21.26 కిలోమీటర్లు ఉండగా, కాళేన అగ్రహార నుంచి నాగవారకు అనుసంధానం కానుంది. 2025 నాటికి అందుబాటులోకి రానుంది. ఇదిలా ఉండగా ఈ మార్గం తెరవడం ద్వారా బీఆర్‌వీ జంక్షన్, అనిల్‌కుంబ్లె సర్కిల్ నుంచి ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని శివాజినగర్ ట్రాఫిక్ పోలీసు అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.



మూసివేసిన రహదారి (ఫైల్)



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం బెళ్లందూరులోని బెంగళూరు టీడీపీ ఫోరం కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం ముఖ్యుడు పవన్ మోటుపల్లి మాట్లాడుతూ చంద్రబాబు ఏపీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారన్నారు. ఆయనకు మద్దతు ఇచ్చేందుకు ప్రవాసాంధ్రులందరూ సొంతూళ్లకు వెళ్లి తెలుగుదేశంకు బలపరుద్దామని పిలుపునిచ్చారు. రెండు వారాల సెలవు పెట్టుకుని ఎన్నికలకోసం వెళ్దామని సూచించారు. కేక్ కట్ చేసి చంద్రబాబు పేరిట నినాదాలు చేశారు. ఫోరం సభ్యులు బాలచంద్ర, ప్రసాద్, బాలాజి, ప్రతీశ్ తదితరులు పాల్గొన్నారు. కృష్ణరాజపురంలో జరిగిన వేడుకల్లో బాలాజి గుప్తతోపాటు పలువురు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.




టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో..

ఆదుకునేది ఆంధ్రులే..!



- విలక్షణ రాజకీయాలకు నిలయం చిత్రదుర్గం
- ప్రవాసాంధ్రుల ఓట్లే కీలకం
- పలుసార్లు స్థానికేతరులకే అవకాశం
- ఆసక్తికరంగా లోక్‌సభ ఎన్నికలు
- బీజేపీ అభ్యర్థిగా గోవింద కారజోళ, కాంగ్రెస్ అభ్యర్థిగా బీఎస్ చంద్రప్ప



చిత్ర దుర్గం కోట

బళ్లారి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గం విలక్షణ రాజకీయాలకు పెట్టని కోట. ఇక్కడ ప్రజల తీర్పును అంచనా వేయడం అంత సులభం కాదు. ఎవరికీ అంత సులువుగా అవకాశం ఇవ్వరు. పైగా చిత్రదుర్గం జిల్లా చాలా వరకూ అంధ్ర గడినాడు ప్రాంతాన్ని ఆనుకుని ఉంటుంది. ఇక్కడ అంధ్ర ఓటర్ల ప్రభావమే అధికంగా ఉంటుంది. దీంతో ఇక్కడ విజయం ఎవరిది అన్నది ఆంధ్ర ఓటర్ల తీరు పైనే ఆధారపడి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంత వరకూ గెలిచిన వారిలో ఎక్కువ మంది స్థానికేతరులే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో మధ్య కర్ణాటక జిల్లాలో కీలకమైన చిత్రదుర్గం జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. సుమారు 20 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినా ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ నెలకొంది. చిత్రదుర్గం లోక్‌సభ స్థానం ఎస్సీ రిజర్వుడు కావడంతో బీజేపీ నుంచి గోవింద కారజోళ, కాంగ్రెస్ అభ్యర్థిగా బీఎస్ చంద్రప్ప బరిలో నిలిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ నుంచి గెలుపొందిన ఎంపీ నారాయణస్వామి ప్రస్తుతం కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. అయితే ఈ సారి ఎన్నికల్లో ఆయన ఇక్కడ నుంచి పోటీ చేయడానికి విముఖత చూపడంతో బీజేపీ నుంచి గోవిందస్వామి కారజోళను పార్టీ రంగంలోకి దించింది. కాంగ్రెస్ అభ్యర్థి చంద్రప్ప సమరానికి సిద్ధం అంటున్నారు. చంద్రప్ప మూడు సార్లు కాంగ్రెస్ టికెట్ దక్కించుకుని ఓడిపోయారు. మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



గోవింద కారజోళ (బీజేపీ)



చంద్రప్ప (కాంగ్రెస్)

- చిత్రదుర్గం లోక్‌సభ నియోజకవర్గం 1952 నుంచి 2004 వరకూ జనరల్ నియోజకవర్గంగా ఉండేది. 2009లో ఎస్సీ రిజర్వుడు స్థానంగా మారింది. 1952 నుంచి 2019 వరకూ జరిగిన 17 ఎన్నికల్లో చిత్రదుర్గం నుంచి 10 సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. 1952లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు ఎస్. నిజలింగప్ప కాంగ్రెస్ టికెట్‌పై గెలిచారు. ఆ తరువాత 1962లో ఎస్ వీరబసప్ప, 1977, 1980లో రెండుసార్లు కే. మల్లన్న, 1984లో మాజీ మంత్రి కే.హెచ్ హనుమంతప్ప, 2014లో బిఎన్ చంద్రప్ప గెలుపొందారు.
- 1957లో ప్రజాసోషలిస్టు పార్టీ టిక్కెట్‌పై 1967లో స్వతంత్ర అభ్యర్థి జేఎం ఇమాం సాబ్ రెండు సార్లు గెలుపొందారు. 1971లో ఎన్‌జీపీ టికెట్ పై కొండజ్జి బసప్ప, 1999లో జనతాదళ్ టికెట్ పై విశ్రాంత ఐపీఎస్ అధికారి పి కోదండరామయ్య, 1999లో జేడీయూ టికెట్‌పై ప్రముఖ చలన చిత్ర నటుడు శశికుమార్ విజయం సాధించారు. 2009లో ఎస్సీ రిజర్వు కావడంతో బీజేపీ నుంచి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా గా పని చేస్తున్న జనార్దన్ స్వామి 2019లో ఏ. నారాయణస్వామి గెలుపొందారు.
- పార్టీల బలాబలాలు బట్టి చూస్తే బీజేపీ అభ్యర్థి గోవింద కారజోళ, అలాగే కాంగ్రెస్ అభ్యర్థి చంద్రప్ప ఇద్దరూ మంచి పేరు ఉండే నాయకులే, దీంతో చిత్రదుర్గం కోటలో ఏపార్టీ జెండా ఎగురు తుందోనని ఓటర్లు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు.

272 మంది అభ్యర్థులు..

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో విడత 14లోక్‌సభ నియోజకవర్గాల్లో 272 మంది బరిలో నిలవనున్నారు. శనివారం నామినేషన్ల పరిశీలన ముగిసింది. 503 నామినేషన్లను ఎన్నికల అధికారులు పరిశీలించారు. 109 నామినేషన్లను తిరస్కరించారు. 335మంది అభ్యర్థులు 503 సెట్ల నామినేషన్లు వేయగా 394 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. అయితే అభ్యర్థులు ఎక్కువ నామినేషన్లు దాఖలు చేసిన మేరకు వాటిని రద్దు చేశారు. చివరగా 272మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ప్రకటించారు. 14 నియోజకవర్గాలకు గాను నామినేషన్లు 272 మంది బరిలో నిలిచారు. దావణగెరెలో 33మంది, బాగల్కోట, శివమొగ్గలలో 26మంది చొప్పున, ధారవాడలో 25మంది అభ్యర్థులు కాగా బెళగావిలో 21, చిక్కోడిలో 20, విజయపుర (బిజాపూర్)లో 12 మంది, రాయచూరులో 10మంది, బీదర్ 20మంది, కొప్పళ 23, బళ్ళారి 11, హావేరి 14, ఉత్తరకన్నడ 13మంది బరిలో ఉన్నారు. అత్యల్పంగా రాయచూరులో 10మంది, అత్యధికంగా దావణగెరెలో 33మంది ఉన్నారు. కాగాసురపుర శాసనసభకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో 13 నామినేషన్లు దాఖలు కాగా పరిశీలన తర్వాత ఏడుగురు నిలిచారు.



దింగాలేశ్వర స్వామికి పేమెంట్ అందింది..


- ఎన్నికల తర్వాత ఎవరిచ్చారో చెబుతా : బీజేపీ ఎమ్మెల్యే యత్నాళ్

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ధారవాడ నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్న దింగాలేశ్వరస్వామికి భారీగా పేమెంట్ అందిందని, ఎన్నికల తర్వాత పేమెంట్ ఎవరిచ్చారో బహిర్గతం చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ఆరోపించారు. హుబ్బళ్ళిలో శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన దింగాలేశ్వరస్వామి పోటీ చేయడంలో తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. అయితే ఎవరి ప్రమేయంతో చేస్తున్నారనేదే ముఖ్యమన్నారు. దేశం విషయంలో వీరశైవలింగాయతలు బీజేపీతో కలసి ఉంటారన్నారు. కానీ దింగాలేశ్వరస్వామి పోటీ ఎందుకోసమో ..? అన్నారు. గతంలో మాతా మహదేవి కూడా పోటీ చేశారని, ఎన్ని ఓట్లు వచ్చాయో అందరికీ తెలుసునన్నారు. దింగాలేశ్వరస్వామికి 5వేల ఓట్లు వస్తాయన్నారు. గతంలో మాజీ మంత్రి వినయ్‌కులకర్ణి స్వామీజీని దూషించేవారంటూ, ప్రస్తుతం మంచివారంటూ కొనియాడుతున్నారన్నారు. అంటే స్వామీజీకి పేమెంట్ అయినట్లు తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో తాలిబాన్ సంస్కృతిని గవర్నర్ గమ నిస్తున్నారన్నారు. అన్ని సంఘటనలపై రాష్ట్రపతికి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ విషయమై గవర్నర్‌ను కలిసేందుకు వేచి చూస్తున్నామన్నారు. బెంగళూరు గ్రామీణ పరిధిలో డీకే శివకుమార్ ఓటర్లను బెదిరిస్తున్నారని ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకోవాలన్నారు. శివమొగ్గలో ఎన్నికల ప్రచారానికి వెళ్లేంతటి పెద్ద వ్యక్తిని నేను కాదన్నారు. అక్కడ ముగ్గురు సీనియర్‌లు ఉన్నారని, అంతదూరం కాళ్లు పెట్టలేనన్నారు. శివమొగ్గ ఎన్నికల గురించి మాట్లాడేది లేదన్నారు.



బెంగళూరు ఉత్తరం ఎవరికో..?

- నియోజకవర్గంలో పెరిగిన పోటీ
- కాంగ్రెస్, బీజేపీ నుంచి బలమైన అభ్యర్థులు



ప్రొఫెసర్ రాజీవ్‌గౌడ

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో కీలకమైన నియోజకవర్గం బెంగళూరు ఉత్తర లోక్‌సభ స్థానానికి ఉత్తరాధికారి ఎవరు కానున్నారనేది ఆసక్తికరంగా మారింది. ఇక్కడి నుంచి ఇద్దరు అనూహ్యమైన అభ్యర్థులు బరిలో నిలిచారు. బెంగళూరు ఉత్తర లోక్‌సభ పరిధిలో కేఆర్‌పుర, బ్యాటరాయనపుర, యశ్వంతపుర, దాసరహళ్లి, మహాలక్ష్మి లే అవుట్, హెబ్బాళ్, పులకేశినగర్, మల్లేశ్వరం శాసనసభ నియోజకవర్గంలోని కొంతభాగం అనుబంధంగా ఉంది. ఇక్కడ 8 అసెంబ్లీ స్థానాల్లో ఐదుగురు బీజేపీ ఎమ్మెల్యేలు కాగా ముగ్గురు కాంగ్రెస్‌కు చెందినవారు ఉన్నారు. వీరిలో కృష్ణబైరేగౌడ, బైరతి సురేశ్ మంత్రులుగా వ్యవహరిస్తుండగా పులకేశినగర్ రిజర్వు నియోజకవర్గం నుంచి ఏసీ శ్రీనివాస్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కేంద్రమంత్రిగా ఉన్న శోభాకరంద్లాజె బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి కాగా కాంగ్రెస్ నుంచి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ రాజీవ్‌గౌడ పోటీలో ఉన్నారు. 1952కు ముందు కెంగల్ హనుమంతయ్య, ఆ తర్వాత కేంద్రరైల్వేశాఖ మంత్రిగా వ్యవహరించిన జాఫర్ షరీఫ్ వంటి కీలక నేతలు ఇక్కడ ఎంపీలుగా కొనసాగారు. నియోజకవర్గ పరిధిలో 16.29 లక్షల మంది పురుషులు కాగా 15.44 లక్షలమంది మహిళలు, 594 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి సదానందగౌడ పోటీ చేసి 8,24,500 ఓట్లు సాధించగా, కాంగ్రెస్ నుంచి ప్రస్తుత రాష్ట్ర మంత్రి కృష్ణబైరేగౌడ 6,76,982 ఓట్లు పొందారు. ఆయనకు ప్రస్తుత ఎన్నికల్లో టిక్కెట్ దక్కలేదు.



శోభ కరంద్లాజె

ప్రజలతో మమేకమైతేనే గుర్తింపు

- తొలిసారి బరిలో నిలిచినా విశేషంగా ఆదరిస్తున్నారు
- కాంగ్రెస్ పార్టీ కులానికి, మతానికి పరిమితం కాదు
- చిక్కబళ్లాపుర కాంగ్రెస్ అభ్యర్థి రక్షా రామయ్య



బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలంటే పరిచయం చేసుకోవడం, అవకాశం కోరడం మాత్రమే కాదని నిరంతరంగా ప్రజలతో మమేకమైతేనే ప్రజాప్రతినిధిగా రాణింపు సాధ్యమని చిక్కబళ్లాపుర లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రక్షా రామయ్య అభిప్రాయపడ్డారు. తొలిసారి లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న రక్షారామయ్య ఆశయాలు, ఆలోచనలు, ఎన్నికల్లో వ్యూహాలను 'ఆంధ్రజ్యోతి'తో శనివారం పంచుకున్నారు.

మీకు కాంగ్రెస్ టిక్కెట్ ఎలా దక్కింది?

కాంగ్రెస్ పార్టీలో కొన్నేళ్లుగా సేవలందిస్తున్నాను. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగానే కాకుండా జాతీయ కమిటీలో కీలకంగా వ్యవహరిస్తున్నా. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం, డీసీఎంల ఆశీస్సులతోనే పోటీ చేసే అవకాశం దక్కింది. యువతకు రాజకీయాల్లో అవకాశాలు పెంచాలనే రాహుల్‌గాంధీ ఆశయం కూడా నాకు టిక్కెట్ దక్కేందుకు సాధ్యమైంది.

తొలిసారి లోక్‌సభకు పోటీపై ఏమంటారు?

ఇది నాకు తొలి ఎన్నికే. అయితే పది నెలలక్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించా. ఎన్నికల్లో ఎలా వ్యవహరించాలనేది దగ్గరి నుంచి చూశా. యూత్‌కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తెలంగాణ ఎన్నికల్లో పనిచేసిన అనుభవం కూడా ఉంది. 1999 నుంచి యూత్ కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా ఉన్నా. రెండున్నర దశాబ్దాలపాటు పార్టీ సేవలో ఉన్నా. పార్టీ విధి విధానాలు, నాయకులతో సంబంధాలు ఉన్నాయి. నేరుగా ఎన్నికల్లో పాల్గొనడం తొలిసారి అయినా ప్రతి ఎన్నికల్లోనూ నావంతు భాగస్వామ్యం ఉంది.

విజయానికి మీ వ్యూహాలు ఏమిటి?

రాజకీయం అనేది చదరంగంలాంటిది. అయినా ప్రజాభిమానం, నమ్మకం పొందడమే ముఖ్యం. ప్రజలతో కలసి మెలసి వారి కష్టాలు, సుఖాలలో పాలు పంచుకోవడమే ప్రజాప్రతినిధికి కావాల్సిన అర్హత. నిష్కల్మష రాజకీయాలను ప్రజలు స్వీకరిస్తారు. పార్టీలో భాగస్వామ్యంగా కొన్నేళ్లపాటు పనిచేస్తున్నందున సహజంగానే అలవడ్డాయి. ప్రజాబలమే నాకు రక్ష.

లోక్‌సభకు మీరు బయటవారనే విమర్శపై?

మా కుటుంబం కైవార తాతయ్య పరంపర కల్గినవారము. తాతయ్య ఆదర్శాలు పాటిస్తూ వస్తున్నాం. మా తాత ఎంఎస్ రామయ్య ఈ ప్రాంతానికి సుపరిచితులు. పెదనాన్న డాక్టర్ ఎంఆర్ జయరాం దేవనహళ్ళి ఎమ్మెల్యేగా వ్యవహరించారు. నా తల్లి బెంగళూరు జయనగర ప్రాంతమైనా నా బాల్యమంతా దేవనహళ్ళిలోనే సాగింది. చిక్కబళ్ళాపుర ప్రాంతంలో నాకు బంధువులు ఉన్నారు. ఈ ప్రాంతంతో బాల్యం నుంచి నాకు సంబంధాలు ఉన్నాయి.

మీ ప్రత్యర్థి గురించి ఏమంటారు?

నా ప్రత్యర్థి గురించి నియోజకవర్గంలోనే కాదు రాష్ట్రమంతటా అందరికీ తెలుసు. నియోజకవర్గంలోని దళిత సంఘాలు, రైతు సంఘాలు, టీసీ సంఘాలతోపాటు పలువురు బహిరంగంగానే ఆయనపై విమర్శలు చేశారు. మంత్రిగా ఉన్నప్పుడు ఆయన వ్యవహరించిన తీరు కళ్లముందే ఉంది. ఆయనతోపాటు ఉండే ఎంతోమంది నాకు మద్దతు ఇస్తున్నారు. నా ప్రత్యర్థిపై నియోజకవర్గంలో మంచి అభిప్రాయం లేదు.

సామాజిక ముసుగులో ఎన్నికల్లోకి వచ్చారనే అంశంపై?

కాంగ్రెస్ పార్టీ ఒక మతానికి, కులానికి పరిమితం కాలేదు. కాంగ్రెస్‌లో ఎదిగాను. నా రక్తంలో కాంగ్రెస్ ఆశయాలు ఉన్నాయి. ఎన్నికల ప్రచారం, నిత్యం నాతో కలసి పనిచేస్తున్నవారు, అభిమానులు, కార్యకర్తలు నా సమాజానికి చెందినవారా? అటువంటి అభిప్రాయాలు ప్రత్యర్థులు వాడే ప్రచారం మాత్రమే. నేను అన్నివర్గాలతో కలసి ముందుకెళ్తున్నా.


వీరప్ప మొయిలీ ప్రచారానికి దూరంపై ఏమంటారు?

చిక్కబళ్ళాపుర అభ్యర్థిగా నాపేరు ప్రకటించిన వెంటనే మాజీ సీఎం వీరప్పమొయిలీ బహిరంగంగా మద్దతు ప్రకటించారు. ఆయన మేధావి రాజకీయ నేత అన్నారు. టిక్కెట్ దక్కనంతమాత్రాన కొందరు ఆయారాం గయారాంల వ్యవహరిస్తారు. అలాంటి వ్యక్తిత్వం లేనివారు వీరప్పమొయిలీ. నన్ను ఆశీర్వదించారు. ప్రత్యర్థికి కళ్లల్లో రక్తం రావాలని వీరప్పమొయిలీ వ్యాఖ్యానించారు. అంటే పార్టీ కోసం ఏవిధంగా వ్యవహరిస్తారనేది ఇది ఉదాహరణ కాదా అన్నారు. ప్రతి రోజూ ప్రచారం ఉత్సాహంగానే సాగుతోంది. చిక్కబళ్ళాపురకోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా. పూల వ్యాపారంలో దేశ రాజధానిగా చిక్కబళ్ళాపురను తీరుస్తానని వందశాతం అక్షరాస్యత, యువతకు ఉద్యోగాలు, నా ఆశయమన్నారు. శాశ్వత నీటి వనరు పోరాటంపై కాంగ్రెస్ ఎంపీలు ఎంతో పనిచేశారు. ఎత్తిపోతల పథకం ద్వారా సమస్యను పరిష్కరిస్తా.

ప్రధాని మోదీ హవా ముందు మీ గ్యారెంటీలు?

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒకప్పటి హవా లేదని ఆయన పథకాలు సామాన్యులకు అండ కాలేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో నిత్యావసర ధరలు పెరిగాయి. నిరుద్యోగం 24శాతానికి చేరింది. ఇది స్వాతంత్ర్యం తర్వాత రికార్డుగా మారింది. ప్రజలు రాష్ట్రంలో అమలవుతున్న పథకాలపై విశ్వాసంతో ఉన్నారు. అదే మాకు కొండంత బలం. బీజేపీ-జేడీఎస్‌ల మైత్రి ఏర్పడినా కార్యకర్తలను కిందిస్థాయి నాయకులతో ప్రస్తావన లేకుండానే ఒప్పందం పని చేయడం లేదు. ప్రస్తుత ఎన్నికలు రాజ్యాంగాన్ని రక్షించడం, ప్రజల కష్టాలను దూరం చేయడం కోసం జరుగుతున్నాయి. గడిచిన పదేళ్లలో రాష్ట్రం నుంచి బీజేపీ నుంచి 25మంది ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి సంబంధించి నీరు, నేల, పన్నుల వాటాలు, కరువు, వరదసాయం సాధించడంలో విఫలమయ్యారు. ఇవే నాకు కలసి వస్తున్న అంశాలు.

ఎగిరే గువ్వలకు లక్షల గింజలు !



వైసీపీ కార్పొరేటర్లు పక్క చూపులు చూడకుండా తాయిలాలు

అనంత అర్బన్‌లో బలాన్ని బట్టి రూ.లక్షల చెల్లింపు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 20: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అధికార వైసీపీ తమ పార్టీ కార్పొరేటర్లకే డబ్బు పంచాల్సి వస్తోంది. కొందరు కార్పొరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ఉండటంతో వారు టీడీపీ వైపు వెళ్తారేమోననే ఆందోళనతో అధికార పార్టీ తాయిళాలకు తెర తీసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కార్పొరేటర్లకు వారి బలాన్ని బట్టి రూ.లకారాలు ముట్టజెప్పినట్లు తెలిసింది. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 50 డివిజన్లు, నాలుగు గ్రామ పంచాయతీలున్నాయి. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, వైసీపీ అభ్యర్థిగా అనంతవెంకటరామిరెడ్డి పోటీ చేస్తున్నారు. ప్రధాన పోటీ ఈ ఇద్దరి మధ్యే ఉండనుంది.

ఒక్కొక్కరికి రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలు...

ఎన్నికలు సమీపిస్తున్నా కొందరు కార్పొరేటర్లు సైలెంట్‌గా ఉండటం వైసీపీ అభ్యర్థికి గుబులు పుట్టించింది. దీంతో కొత్త ఓట్లు దేవుడెరుగు, ఉన్న ఓట్లు నిలుపుకుంటే చాలు అనుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే కార్పొరేటర్లకు తాయిళాల పంపకం చేపట్టినట్లు తెలుస్తోంది. మూడేళ్ల కిందట జరిగిన మున్సినల్ ఎన్నికల్లో నగరపాలిక పరిధిలోని 50 డివిజన్లకు గాను 48మంది కార్పొరేటర్లు వైసీపీ తరపున గెలుపొందారు. వీరిలో అత్యధికులు కొత్తగా పోటీ చేసిన వారే. అనంతపురం అర్బన్‌లో ఇంకా కొన్ని వర్గాలు ఎమ్మెల్యే అభ్యర్థికి దూరంగానే ఉంటున్నాయి. అదే క్రమంలో కొందరు కార్పొరేటర్లు సైతం ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేటర్లకు లెక్కల గాలం వేసినట్లు సమాచారం. ఒక్కో కార్పొరేటర్‌కు రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు అందజేసినట్లు తెలిసింది. నగరంలోని 30మంది కార్పొరేటర్లకు లెక్కలు అందినట్లు తెలుస్తోంది.

జంపింగ్ ఊహాగానాలతోనే....

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఓ ప్రచారం ఊపందుకుంది. వైసీపీ నుంచి టీడీపీలోకి 15మంది వరకు కార్పొరేటర్లు వెళ్తారనే ప్రచారం జరిగింది. దీంతో ఆ గోడ దూకే కార్పొరేటర్లపై వైసీపీ నేతలు ఆరా తీసినట్లు తెలిసింది. రెండు వారాల కిందట కార్పొరేటర్లు హరిత, బాబా ఫక్రుద్దీన్‌లు టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో మరింత మంది జంప్ అయ్యే ప్రమాదముందని భావించిన వైసీపీ నేతలు దిద్దుబాటు చర్యలకు దిగారు. అందుకే ముడుపుల బేరం పెట్టినట్లు సమాచారం. అలా రూ.లకారాలు జేబుల్లోకి నింపుకున్న కార్పొరేటర్లు వైసీపీ అభ్యర్థి ప్రచారంలో సందడి చేస్తున్నారట.

దోస్త్.. మేరా దోస్త్

సరిగ్గా ఐదేళ్ల కిందట వారిద్దరు రాజకీయ ప్రత్యర్థులు. ఎప్పుడైనా ఎదురుపడినా ఒకరివైపు ఒకరు చూసుకునేవారు కాదు. నిన్న మొన్నటి దాకా అలాగే ఉండేవారు. అయితే అధికార పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలు ఆ వైసీపీ నాయకుడి ఆలోచనలు మార్చివేసింది. గౌరవం లేని చోట ఉండటం ఎందుకని భావించి ఏపార్టీని అయితే ప్రత్యర్థిగా భావించి పని చేశారో అదే పార్టీలోకి చేరిపోయారు. ఆయనే మాజీ పోలీస్ అధికారి మహ్మద్ ఇక్బాల్. ఆయనకు ప్రత్యర్థి నందమూరి బాలకృష్ణ. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వీరిద్దరూ చెరో పార్టీ తరఫున పోటీ చేశారు. అప్పుడు టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ గెలుపొందగా ఇక్బాల్ ఓడిపోయారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ఇక్బాల్ హిందూపురం వైసీపీ ఇన్‌చార్జ్‌గా గత ఏడాది జూలై వరకు కొనసాగారు. దీంతో వారి మధ్య రాజకీయ వైరం కొనసాగింది. కానీ పార్టీ తన పట్ల వ్యవహరిస్తున్న తీరును ఇక్బాల్ జీర్ణించుకోలేక పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. రెండు రోజుల కిందట చిలమత్తూరు మండలంలో వైసీపీ నాయకుడు నాగరాజుయాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్ తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరు ఎమ్మెల్సీ అనుచరులు కావడంతో చేరిక సందర్భంగా ఇక్బాల్ చిలమత్తూరుకు వచ్చారు. అక్కడికి బాలకృష్ణ కూడా వచ్చారు. నాగరాజుయాదవ్ ఇంట్లో బాలకృష్ణ, ఇక్బాల్ చేతులు కలిపారు. ఇది చూసిన జనం నాటి ప్రత్యర్థులే నేడు సన్నిహితులయ్యారని ఇద్దరికీ జైకొట్టారు.

- హిందూపురం



చేతులు కలిపిన బాలకృష్ణ, ఇక్బాల్

ఎస్సీ, ఎస్టీలను కూలీలుగా మార్చిన వైసీపీ

- భూమి కొనుగోలు పథకానికి మంగళం
- ఐదేళ్లలో ఎకరా కూడా కొనుగోలు చేయని దుస్థితి
- టీడీపీ హయాంలో ఎస్సీలకు రూ. 23.31 కోట్లతో 799 ఎకరాలు
- ఎస్టీలకు రూ.62.72 లక్షలతో 49.44 ఎకరాల కొనుగోలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 20 : 'నా ఎస్సీలు.. నా ఎస్టీలు.. వారి అభివృద్ధే నా ధ్యేయం... వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తా' అంటూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బహిరంగ సభల్లో అలవికాని ప్రేమ ఒలకబోస్తూ ఉంటారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఎస్సీ,ఎస్టీల అభివృద్ధి ఎక్కడ జరిగిందో... ఎలా జరిగిందో అర్థంకాని విధంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ఎస్సీ,ఎస్టీలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వాలు ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్‌ను ప్రవేశపెట్టాయి. అందుకనుగుణంగా భూములను కేటాయిస్తూ వచ్చాయి. గత టీ డీపీ ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీల కోసం భూములు కొనుగోలు చేసి వారికందించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ స్కీమ్‌ను తొలగించి ఆ వర్గాల ప్రజల నోట్లో మట్టి కొట్టింది. వైసీపీ ఐ దేళ్ల పాలనలో ఒక్క ఎకరా కొనుగోలు చేయలేదంటే ఎస్సీ,ఎస్టీల పట్ల ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉంటే అర్థమవుతోంది. ఎస్సీ,ఎస్టీలు అగ్రవర్ణాల కిం ద కూలీలుగా ఉండాలనే దురుద్దేశ్యంతోనే తమను ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ కూలీలుగా మార్చిందని ఆ వర్గాలు మండిపడుతున్నాయి.

టీడీపీ హయాంలో భూముల పంపిణీ

2014 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం జిల్లాలో భూములు లేక వ్యవసాయ కూలీలుగా ఉన్న ఎస్సీలకు ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్ కింద భూములు అందించాలని తలంచింది. ఇందుకోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక బృందాన్ని ఏర్పాటు చేసి భూములు లేనినిరుపేద ఎస్సీల జాబితాను సిద్ధం చేసింది. కార్పొరేషన్ అధికారులు అందించిన నివేదికల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 317 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. జిల్లాలో పలు ప్రాంతాల్లో 799.98 ఎకరాల భూమిని గుర్తించి కొనుగోలు చేసింది. ఆ భూముల కొనుగోలు కోసం రూ. 23.31 కోట్లను ఖర్చు చేసింది. ఎస్టీ వర్గాల్లో వ్యవసాయ భూములు లేని వారి కోసం ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్ కింద రూ. 62.72 లక్షల నిధులను విడుదల చేసింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 22 మందిని ఎంపిక చేశారు. వారి కోసం దాదాపు 49.44 ఎకరాలను కొనుగోలు చేసి అప్పగించారు. ఎస్టీల కోసం వ్యవసాయానికి బోర్లు లేని వారిని 20 మందిని ఎంపిక చేసి డిగ్గింగ్ బోర్ వెల్స్ స్కీమ్ కింద 20 మంది లబ్ధిదారులకు రూ. 22.80 లక్షలు ఖర్చు చేసి బోర్లు వేయించింది. బోర్లు ఉండి విద్యుత్ సౌకర్యం లేని వారి కోసం ఎనర్జిసేషన్ ఆఫ్ ఎస్టీ బోర్ వెల్స్ పథకం కింద 690 మంది ఎస్టీ లబ్ధిదారులకు రూ. 6.62 కోట్లు ఖర్చుచేసి కరెంటు సౌకర్యాన్ని కల్పించింది. మొత్తం మీద ఎస్సీ, ఎస్టీ పేద ప్రజల కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. 30 కోట్లకు పైగా ఖర్చు చేసింది.

భూములు పంచకపోగా... కబ్జాకు స్కెచ్...

టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ వర్గాల కోసం భూములు కొనుగోలు చేసి అందిస్తే... వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క ఎకరా కొనుగోలు చేయకపోగా... గతంలో లబ్ధిదారులకు అందించిన భూములపై కన్నేసింది. వైసీపీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు ఎస్సీ,ఎస్టీల చేతుల్లో ఉన్న భూములను కబ్జాకు స్కెచ్ చేశారు. ప్రధానంగా తాడిపత్రి పరసర ప్రాంతాలు యల్లనూరు, పుట్లూరుతో పాటుమరికొన్ని ప్రాంతాల్లో దాదాపు 160 ఎకరాలకుపైగానే పలువురు రాజకీయ నేతల కబంధ హస్తాల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. దీంతో లబ్ధిదారులు ఆ ప్రజాప్రతినిధుల వద్ద తీసుకున్న అప్పును తీర్చలేక... భూములను విడిపించుకోలేక సతమతమవుతున్నారు. ఇలా వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ,ఎస్టీ ప్రజలకు ఉన్న పథకాలను వర్తింపజేయకపోగా ఉన్న వాటిని లాగేసుకునే ప్రయత్నం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల సముదాయం పెన్నార్ భవన్

వైసీపీ హయాంలో అన్యాయం


వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎస్సీ,ఎస్టీలకు తీరని అన్యాయం జరిగింది. 27 పథకాలను రద్దు చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఇవ్వకుండా మోసం చేశారు. పేద ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవెలబుల్ స్కూల్ స్కీంను ఎత్తేసి కార్పొరేట్ విద్యకు దూరం చేశారు. పేద ఎస్సీ,ఎస్టీ ప్రజల కోసం టీడీపీ ప్రభుత్వం ల్యాండ్ పర్చేసింగ్ స్కీమ్ కింద ఎంతో మంది పేద ఎస్సీ,ఎస్టీలకు భూములను ఉచితంగా కేటాయించింది. వైసీపీ వచ్చాక ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వకుండా మోసం చేసింది. సీఎం జగన్‌రెడ్డి నా ఎస్సీ.. నా ఎస్టీ అంటూనే ఆ వర్గాలను అణచివేతకు గురిచేశారు.

-లక్ష్మన్న, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు,
పి. నారాయణపురం, కూడేరు మండలం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

మహావీర్ జయంతి



అహింసను ప్రబోధించిన జైన మత ప్రచారకుడు. వర్ధమాన మహావీరుడి జయంతిని ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ త్రయోదశిన ఘనంగా ఆచరిస్తారు. క్రీస్తు పూర్వ 599 సంవత్సరంలో జన్మించినట్టుగా తెలుస్తోంది. క్షత్రియ కుటుంబంలో జన్మించిన ఆయన వివాహమైన కొంతకాలానికి 36వ యేట సన్యాసదీక్ష స్వీకరించారు. 12 ఏళ్లపాటు తపస్సు చేసి మహావీరుడిగా జైనతమ ప్రచారకుడిగా మారారు. అప్పటికే జైన మతానికి 23 మంది తీర్థంకరులు ఉన్నప్పటికీ మహావీరుడు బాధ్యతలు చేపట్టాకే గుర్తింపు లభించింది. జీవితకాలం అహింస, ధర్మాని ప్రబోధించారు.

క్వీన్ ఎలిజబెత్ (జయంతి)




బ్రిటీష్ దేశ రాణి ఎలిజబెత్ 2 (ఎలిజబెత్ అలెగ్జాండ్రా మేరీ) 1926 ఏప్రిల్ 21న లండన్‌లోని మేఫైర్ ప్రాంతంలో జన్మించారు. కింగ్‌జార్జ్6, ఎలిజబెత్‌ల తొలి సంతానం ఈమె. 32 సావరన్ స్టేట్స్‌కు రాణిగా 1952 నుంచి 2022 వరకు వ్యవహరించారు. బ్రిటీష్ చరిత్రలో 70ఏళ్ల సుదీర్ఘకాలం కొనసాగిన మహారాణిగా గుర్తింపు పొం దారు. వివిధ దేశాలనుంచి పలు గౌరవాలు అందు కున్నారు. 96వ యేట 2022 సెప్టెంబరు 8న కన్ను మూశారు. ఆమె అనంతరం పెద్దకుమారుడు చార్లెస్3 కొనసాగుతున్నారు.

ఆంటోని క్విన్ (జయంతి)



మెక్సికన్-అమెరికన్ నటుడు ఆంటోని క్విన్ 1915 ఏప్రిల్ 21న జన్మించారు. రైటర్‌గా, ఫిల్మ్ డైరెక్టర్ గాను చిత్రకారుడిగా ప్రతిభ చాటారు. హాలీవుడ్‌లో వి భిన్న పాత్రలతో తనదైన గుర్తింపు పొందారు. ఉత్తమ సహాయ నటుడిగా రెండుసార్లు అకాడమీ అవార్డు అందు కున్నారు. జొర్బా ది గ్రీక్ సినిమా ఆస్కార్‌కు ఎంపికైంది. 2001 జూన్ 3న కన్నుమూశారు.

మార్క్ ట్వెయిన్ (వర్ధంతి)



కలం పేరు 'మార్క్ ట్వెయిన్'తో పేరొందిన అమెరికాకు చెందిన శామ్యూల్ లాంగార్న్ క్లెమెన్స్ 1835 నవంబరు 30న జన్మించారు. ఆయన నవలలు ప్రపంచవ్యాప్తంగా పేరొందాయి. ఫాదర్ ఆఫ్ అమెరికన్ లిటరేచర్‌గా విలియం ఫాక్నర్ పిలిచారు. టామ్ సాయర్, హకల్ బెరి ఫిన్ నవలలు ఫ్రెంచ్‌లోకి సైతం అనువాదమ య్యాయి. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్ట రేట్ అందుకున్నారు. 1910 ఏప్రిల్ 21న కన్ను మూశారు.

ఎన్. గోపాలస్వామి (పుట్టినరోజు)



పద్మభూషణ్ గ్రహీత ఎన్ గోపాలస్వామి 1944 ఏప్రిల్ 21న తమిళనాడు రాష్ట్రం తిరువారూర్ జిల్లాలో జన్మించారు. 15వ ఎన్నికల చీఫ్ కమిషనర్‌గా 2006 నుంచి 2009వరకు వ్యవహరించారు. కేంద్రంలో వివిధ హోదాలలో కొనసాగారు. ప్లానింగ్ కమిషన్‌లో విద్యావిభాగం సలహాదారుడిగా వ్యవహరించారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా సొసైటీ, సాట్కామ్ ఇండియా సొసైటీ అధ్యక్షుడిగా వ్యవహరిం చారు. రాష్ట్రీయ సంస్కృతి విద్యాపీఠకు చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. హిందూ సంస్కృతి, వేదాల పరిరక్షణకు యునెస్కో నుంచి రూ.5కోట్లు గ్రాంటు సాధించారు.

రాజీవ్‌గాంధీతోనే ఐటీ అభివృద్ధి

- కన్నడిగులు సౌమ్యులు.. అందరినీ కలుపుకొంటారు
- ఎంపీ పీసీ మోహన్ కర్ణాటక సమస్యలపై మాట్లాడారా?
- ఎన్నికల ప్రచార సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



బహిరంగసభలో ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి

బెంగళూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): దేశంలో సాంకేతికత అభివృద్ధికి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ మూలకారకులని ఆయన పాలనలో కంప్యూటర్లను పరిచయం చేశారని అప్పటి నుంచే ఐటీ రంగం అభివృద్ధి చెందిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలో ఎన్నికల ప్రచారసభలో పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం బెంగళూరు అంటే దేశంలోనే కాదని, విదేశాల్లో సైతం ఐటీ నగరి అనే పేరొందిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఐటీ అభివృద్ధి సాధ్యమైందన్నారు. యువతకు ఉద్యోగాలు, ఉపాధి లభించిందన్నారు. బెంగళూరు విశ్వనగరమని ఎక్కడివారు వచ్చినా ఆదరిస్తారన్నారు. కన్నడిగులు సౌమ్యులని కొనియాడారు. ఉద్యోగ, వ్యాపారాలకోసం బెంగళూరులో స్థిరపడిన ప్రవాస తెలుగు ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. మీ మంచి మనస్సుతోనే బెంగళూరులో తెలుగువారు లక్షలాదిమంది నివసిస్తున్నారన్నారు. బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ నాల్గోసారి పోటీ చేస్తున్నారన్నారు. పార్లమెంటులో రాష్ట్రానికి అవసరమైన కరువు నిధులు, తాగునీటి సమస్య, కావేరి జల వివాదం గురించి ఒక్కసారి కూడా ప్రస్తావించలేదన్నారు. పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌కు వెళ్లి పల్లీబఠానీలు తిని, చాయ్ తాగి వస్తారన్నారు. ఆ పనిచేసేందుకు బెంగళూరు బస్టాండ్‌కు వెళ్లినా సరిపోతుందని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ మూడోసారి గెలిపించాలని కోరుతున్నారని ఏం చేశారని ప్రశ్నించారు. పదేళ్లలో మీ సాధన ఏమిటన్నారు. ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. నేను ఎంపీగా లోక్‌సభలో ప్రశ్నిస్తే 7.21 లక్షలు ఉద్యోగాలు ఇచ్చినట్లు ప్రధాని వివరించారన్నారు. 62శాతం యువతకు ఉద్యోగాలు లేవన్నారు. రైతు ఆదాయం రెట్టింపు కాలేదన్నారు. అన్నదాత వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీ సరిహద్దులో లక్షలాదిమంది రైతులు పోరాటం చేస్తే తుపాకులతో కాల్చారన్నారు. స్విస్‌బ్యాంకు నుంచి నల్లధనం రాలేదని, ఎవరి ఖాతాకు రూపాయి పడలేదన్నారు. ప్రధాని మోదీ ప్రతిచోటా కుటుంబ పాలన ప్రస్తావిస్తారన్నారు. కర్ణాటకలో యడియూరప్ప కుమారుడు ఎమ్మెల్యేతోపాటు పార్టీ అధ్యక్షుడిగా ఉన్నాడని, మరో కుమారుడు ఎంపీగా మళ్లీ పోటీ చేస్తున్నాడన్నారు. ప్రమోద్ మహాజన్, ముండే, వసుంధరరాజ్, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షాలే కాదు బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య చిన్నాన్న ఎమ్మెల్యే అన్నారు. బీజేపీ అవినీతి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. గడిచిన ఎమ్మెల్యే ఎన్నికల్లో ప్రధాని మోదీ దేశంలో అత్యంత అవినీతి పరులు దేవేగౌడ, ఆయన కుమారుడు కుమారస్వామి అంటూ ప్రచారం చేశారని వారిని జైలుకు పంపాలని ప్రకటించారన్నారు. కానీ ప్రస్తుత ఎన్నికల్లో వారితోనే పొత్తు పెట్టుకున్నారన్నారు. గాలి జనార్ధనరెడ్డి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సింది లేదన్నారు. రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర ద్వారా ప్రజల కష్టాలు తెలుసుకున్నారని అందుకే 5 గ్యారెంటీలతో కర్ణాటకలో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రధాని మోదీ హామీలు మోసమని, ఏదీ అమలు చేయలేదన్నారు. నమ్మకానికి ఓటే వేస్తారా..? మోసానికి మద్దతు ఇస్తారా..? అంటూ ప్రశ్నించారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లకు 19 కేబినెట్ మంత్రులు ఇచ్చారని 25మంది ఎంపీలను ఇచ్చిన కర్ణాటకకు కేవలం 1 మాత్రమే అన్నారు. ఈ ప్రాంతవాసులు పాలన సజావుగా చేయలేరా..? అని ప్రశ్నించారు. సభలో అభ్యర్థి మన్సూర్ అలిఖాన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



రోడ్‌షోలో రేవంత్‌రెడ్డి తదితరులు

హొంగసంద్రలో రేవంత్‌రెడ్డి రోడ్‌షో

బొమ్మనహళ్ళి,: బెంగళూరు దక్షిణ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి తరఫున తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేశారు. శనివారం రాత్రి హొంగసంద్రలో ఏర్పాటైన రోడ్‌షోలో మంత్రి రామలింగారెడ్డి, ఉమాపతిగౌడ, నాగభూషణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్‌నాయకులు వాసుదేవరెడ్డి, అశ్వత్థ నారాయణస్వామి, సయ్యద్ సర్దార్, రమేశ్‌రెడ్డి, శ్యామణ్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో కార్యకర్తలు భాగస్వామ్యులయ్యారు.

బుద్ధిమంతులు ఓటింగ్‌కు దూరమైతే.. నిరక్షరాస్యులు దేశాన్ని పాలిస్తారు



వాలీబాల్ విజేతలతో తాలూకా ఈఓ మునిరాజు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 20: విద్యావంతులు, బుద్ధిమంతులు ఓటింగ్‌కు దూరమైతే నిరక్షరాస్యులు, అవినీతిపరులు దేశాన్ని పాలిస్తారని తాలూకా కార్యనిర్వహణాధికారి మునిరాజు అభిప్రాయ పడ్డారు. తాలూకా స్వీప్ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని దిబ్బూరహళ్ళి రోడ్డులోని ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ఆవరణలో ఏర్పాటైన వాలీబాల్ టోర్నీలో పాల్గొని మాట్లాడారు. విద్యావంతులు నాయకులు కావాలని, అలాగే ఓటింగ్‌లో చురుగ్గా పాల్గొనాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్ మాట్లాడుతూ విశ్వంలోనే భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మాదిరిగా ఉందన్నారు. దేశంలో 18ఏళ్ల నిండినవారంతా ఓటు వేయవచ్చునన్నారు. జాతీయ క్రీడాకారుడు జయంతి గ్రామానికి చెందిన నారాయణస్వామి మాట్లాడుతూ ఓటు హక్కుపై మునిరాజు పలు కార్యక్రమాలు రూపొందించారన్నారు. అందరూ ఓటు హక్కు విని యోగించుకోవడం ద్వారా జిల్లాలో తాలూకాను నెంబరువన్ స్థానంలో నిలపాలన్నారు. కార్య క్రమంలో నగరసభ కమిషనర్ గోపాల్ జాదవ్, బీఈఓ నరేంద్రకుమార్, స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారి నౌతాజ్, జేవీ సురేశ్, టీటీ నరసింహప్ప, రాష్ట్ర యువజన సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఫణీంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి జోషి.. లోక్‌సభలో ధన్యవాదాలకే

- ప్రశ్నించిన దాఖలాలే లేవు!
- మరో ఐదుగురు చర్చలకు దూరమే

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కేబినెట్‌లో కీలకమైన పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి లోక్‌సభలో ధన్యవాదాలు తెలపడం మినహా ఐదేళ్లలో ఒక ప్రశ్న కూడా వేయలేదనే అంశంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అయ్యాయి. బెంగళూరులో పౌర సమాజం రాజ్యాంగం పరిధిలో అనే అంశంపై చర్చాగోష్ఠి జరిగింది. శుక్రవారం ఏఆర్ వాసవి, జానకి నాయర్‌లు చర్చాగోష్ఠిని ఏర్పాటు చేశారు. ఇందులో రాష్ట్రానికి సంబంధించి 28మంది ఎంపీలు లోక్‌సభలో వ్యవహరించిన విధానంపై చర్చించారు. 25మంది బీజేపీ ఎంపీలు కాగా ఒకరు కాంగ్రెస్, ఒకరు జేడీఎస్, మరొకరు ఇండిపెండెంట్ ఉన్నారు. దాదాపు సభ్యులందరూ లోక్‌సభ కార్యకలాపాలలో భాగస్వామ్యులై రాష్ట్రానికి జరిపిన చర్చలు జరపడంలో అంతంతమాత్రమే అని తేలింది. లోక్‌సభలో పాల్గొనడం, ప్రశ్నలు, ప్రముఖ చర్చలలో భాగస్వామ్యం అనే అంశంపై చర్చాగోష్ఠి సాగింది. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రిగా సభలో కృతజ్ఞతలు తెలపడం మినహా ఒక్క ప్రశ్న కూడా వేయలేదనే విషయం బహిరంగమైంది. కేంద్ర కేబినెట్ మంత్రిగా వ్యవహరించిన సదానందగౌడ, విజయపుర సీనియర్ ఎంపీ రమేశ్ జిగజిణగి కూడా సభలో ఒక్క ప్రశ్నకూడా వేయని జాబితాలో ఉన్నారు. ఉత్తరకన్నడ ఎంపీ అనంతకుమార్ హెగ్డే, చామరాజనగర ఎంపీ శ్రీనివాస ప్రసాద్, చిక్కబళ్ళాపుర ఎంపీ బచ్చేగౌడ ఎటువంటి చర్చల్లోనూ భాగస్వామ్యం కాలేదు. బెళగావి ఎంపీ మంగళా అంగడి కేవలం ఒక చర్చలో మాత్రమే భాగస్వామ్యులయ్యారు. బెళగావి ఎయిర్‌పోర్ట్ ద్వారా విమానాల సంఖ్య పెంచాలని కోరారు. బెంగళూరు గ్రామీణ కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్, కేంద్ర మంత్రి, ధారవాడ ఎంపీ ప్రహ్లాద్‌జోషిలు కొవిడ్‌వేళ ప్రజలకు సహాయం చేశారని నివేదికలో ప్రస్తావించారు. 12మంది ఎంపీలు గ్రాంట్ల ద్వారా పనిచేయించడం లేదా సభల్లో పాల్గొనడం మినహా వారి సాధన లేదనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. 15 ఎంపీలు నిరాసక్తులుగా వ్యవహరించారు. రాష్ట్రానికి జీఎస్టీ వాటాతోపాటు జన ఔషధి కేంద్రాలకు సంబంధించి ఎంపీ సురేశ్, సదానంద గౌడలు కేవలం ప్రస్తావించారు. అయితే బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్విసూర్య అత్యధిక ప్రశ్నలతోపాటు చర్చల్లోనూ భాగస్వామ్యులైనట్టు విశ్లేషించారు.

ప్రధాని మోదీకి మద్దతుగా పాట పాడినందుకు దాడి

- మైసూరులో కేసు నమోదు

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీపై పాట పాడినందుకు కొందరు యువకులు శుక్రవారం దాడి చేసిన ఘటనలో మైసూరు నజర్‌బాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. హళ్ళికెరె హుండి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ దాడిలో గాయపడ్డాడు. మూడోసారి ప్రధాని మోదీ అధికారంలోకి ఎందుకు రావాలనే కారణంతో ఓ ప్రత్యేకపాటను రాసుకుని ఆయనే పాడారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మైసూరు గెస్ట్‌హౌస్ ప్రాంతంలో యువకుడిని గుర్తించిన సలీం, జావేద్, బాషాతో పాటు మరో ఇద్దరు దాడి చేశారు. లక్ష్మీనారాయణ పేర్కొ న్న ఫిర్యాదులో ఒక్కసారిగా నా నోటిని మూసి చేతులు కాళ్లు బిగించి దాడి చేశారన్నారు. తలపై బీర్ పోశారని, బాటిల్‌తో కోశారన్నారు. శరీరంపై సిగరెట్‌తో కాల్చా రన్నారు. ఇలా క్రూరంగా వ్యవహరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నజర్‌బాద్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా ప్రధాని మోదీకి సంబంధించి పాట పాడితే వారికి కోసం ఎందుకో అంటూ మైసూరు బీజేపీ ఎంపీ అభ్యర్థి యదువీర్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

పోలింగ్‌బూత్‌లలో స్వచ్ఛతా పనులు



స్వచ్ఛతా అభియానలో అధికారులు తదితరులు

బంగారపేట, ఏప్రిల్ 20: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని పోలింగ్‌బూత్ కేంద్రాలలో శనివారం స్వచ్ఛతా పనులు చేపట్టారు. తాలూకా స్వీప్ సమితి, తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో మన నడక స్వచ్ఛ పోలింగ్‌బూత్‌వైపు అనే నినాదంతో కార్యక్రమం చేపట్టారు. సహాయక ఎన్నికల అధికారి శివకుమార్ మాట్లాడుతూ పోలింగ్‌బూత్ పరిసర ప్రాంతాలను స్వచ్ఛంగా ఉంచడం ద్వారా ప్రజలు పోలింగ్‌బూత్‌లకు వచ్చేందుకు సుముఖత చూపేలా చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఓటు హక్కు వినియోగంపై జాగ్రతి నిర్వహిం చామన్నారు. అన్ని పోలింగ్ బూత్‌లలో ఎన్నికల జెండా ఎగురవేస్తామని ఎన్నికలు ముగిశాక అవనతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రశ్మి, పురసభ కమిషనర్ మీనాక్షి, ఈఓ రవికుమార్, అజయ్, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

కళాబృందాలతో ఓటుహక్కుపై జాగ్రతి



మానవహారంగా వివిధశాఖల సిబ్బంది, ప్రజలు

చింతామణి, ఏప్రిల్ 20: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలంతా భాగస్వామ్యం అయ్యేలా తాలూకా స్వీప్ సమితి ఆధ్వర్యంలో వినూత్నంగా జాథా నిర్వహించారు. కళాబృందాలతో ర్యాలీలు నిర్వహిస్తూ, ఓటు వినియోగంపై ప్రతిజ్ఞలు చేయిస్తున్నారు. పట్టణంలోని బెంగళూరు డబుల్ రోడ్డులోని రాజీవ్‌నగర్ లే అవుట్‌లో జాథా ప్రారంభమైంది. డొళ్ళుకుణిత, తమటె వాదన, గారడీబొమ్మలు, వీరగాసె, కీలుగుర్రాలతోపాటు అలంకరించిన ఎడ్లబండ్లు, మానవహారం నిర్మించి ప్లకార్డులు ప్రదర్శించారు. కేఎస్ఆర్టీసీ డిపో సర్కిల్, ప్రవాసిమందిర సర్కిల్, పీసీఆర్ కాంప్లెక్స్ సర్కిల్, ఎంజీ రోడ్డు మీదుగా గజానన సర్కిల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ రోడ్డు మీదుగా క్రీడా మైదానానికి చేరుకున్నారు. తాలూకా స్వీప్ సమితి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న పంచాయతీ ఈఓ ఆనంద్ నేతృత్వంలో ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. దేశ అభివృద్ధికోసం ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. జాథాలో కోలారు లోక్‌సభ అబ్జర్వర్ వస్త్రద్, ఆదిత్య రంజన్, చిక్కబళ్ళాపుర జిల్లా పంచాయతీ సీఈఓ ప్రకాశ్ జీటీ నిట్టాలి, సహాయక ఎన్నికల అధికారి నటేశ్, కార్యనిర్వాహక అధికారి ఆనంద్, తహసీల్దార్ సుదర్శన్ యాదవ్, బీఈఓ ఉమాదేవి, కమిషనర్ మాధవి, సీడీపీఓ మేశ్‌బాబు, నరేగా ఏడీ కవిత పీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై జాగ్రతిలో అధికారులు

సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్‌కు మద్దతు

- సీపీఎం వెల్లడి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గాంధీనగర నారాయణస్వామి

బంగారపేట, ఏప్రిల్ 20: దేశం ఆర్థికంగా సంక్లిష్ట పరిస్థితుల్లో ఉండడంతో 18వ లోక్‌సభ ఎన్నికల్లో దేశం, రాజ్యాంగం మనుగడ ప్రశ్నార్థంగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శి గాంధీనగర నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని కనకభవన్‌లో సీపీఎం తాలూకా విభాగం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయంకోసం ఈసారి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ చేతుల్లో ఉందని ఆరోపించారు. అంతేకాక ప్రతిపక్షాలను ఇబ్బంది కలిగించేలా ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు చేయిస్తోందన్నారు. దేశంలో ఇదే తొలిసారిగా ముఖ్యమంత్రిని జైలు పాలు చేశారన్నారు. తన అధికారం కోసం ఎన్‌సీపీ, శివసేన పార్టీలను విభజించారన్నారు. పీఎం కేర్స్ ద్వారా ప్రైవేట్ కంపెనీల ద్వారా విరాళాల రూపంలో వసూలు చేశారని ఆరోపించారు. శ్రీరాముడు, హిందూత్వ పేరిట అనాదిగా వస్తున్న బీజేపీ దాన్నే ట్రంప్‌కార్డ్‌గా వినియోగిస్తూ ద్వేషం పెంపొందించడం సరికాదన్నారు. సీపీఎం తాలూకా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ గత పదేళ్లలో మోదీ పాలనలో ఆర్థిక సార్వభౌమత్వం, సమాఖ్య వ్యవస్థ, సామాజిక న్యాయం నాశనం చేశారని ఆరోపించారు. అచ్చే దిన్ అంటూ పేదలకు అన్యాయం చేసి శ్రీమంతులను మరింత అభివృద్ధి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి కేవీ గౌతమ్‌కు మద్దతు ఇచ్చేలా తీర్మానించామన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర సమితి కార్యదర్శి మహంతేశ్, కార్యదర్శి మండలి సభ్యుడు పీఆర్ సూర్యనారాయణ, ప్రముఖులు అప్పయ్యణ్ణ తదితరులు పాల్గొన్నారు.

జయకర్ణాటక ఆధ్వర్యంలో 'ఫ్రీ ది ట్రీ'



మొక్కలు నాటే కార్యక్రమంలో సంగీత దర్శకుడు గురుకిరణ్ తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జయకర్ణాటక జనపర వేదిక, ఐకేర్ బ్రిగేడ్ సంస్థలు సంయుక్తంగా 'ఫ్రీ ది ట్రీ' పేరిట మొక్కల సంరక్షణ చేపట్టారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంగీత దర్శకుడు గురుకిరణ్, కర్ణాటక కుస్తీ సంఘం అధ్యక్షుడు గుణరంజన్‌శెట్టిలు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుకిరణ్ మాట్లాడుతూ నగరంలో జనాభా పెరుగుతోందని అందుకు అను గుణంగా చెట్లు లేకుండా పోతున్నాయన్నారు. మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యత కావాలన్నారు. రోడ్ల డాంబరీకరణ కావడంతో చెట్లు ఉనికి కోల్పోతు న్నాయన్నారు. గుణరంజన్‌శెట్టి మాట్లాడుతూ నగరంలో అన్ని వర్గాలలో చైతన్యం తీసుకొచ్చేలా 'ఫ్రీ ది ట్రీ' కార్యక్రమాన్ని కొనసాగించదలిచామన్నారు. ఐకేర్ బ్రిగేడ్ చైర్మన్ ప్రసాద్ శెట్టి, శిల్పా, పూర్ణిమా, గంగాధర్, ఉమేశ్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

బొమ్మనహళ్ళి, ఏప్రిల్ 20: రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదని ఆరోపిస్తూ ఖాళీ చెంబులతో శనివారం నిరసన తెలిపారు. హోసూరు రోడ్డులోని బొమ్మనహళ్ళి కూడలిలో నిరసన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. వేల కోట్ల రూపాయల పన్నులు జీఎస్టీ రూపంలో వసూలవుతున్నా రాష్ట్ర వాటా మాత్రం ఆమేరకు కేటాయించడం లేదన్నారు. రాష్ట్రంలో 25మంది బీజేపీ ఎంపీలు ఉన్నా ప్రగతి శూన్యమన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, రమేశ్ రెడ్డి, సయ్యద్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

నేమకల్లు ఆంజనేయుడికి విశేష పూజలు



అలంకరణలో స్వామివారు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 20: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి చైత్ర మాసం తొలి శనివారం సందర్భంగా విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు స్వామివారికి పూజలు చేశారు. వేకువ జామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, అష్టోత్తర నిర్వహించి వెండికవచ అలంకరణ, పుష్పాలంకరణ, నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. మాజీ ధర్మకర్త కాశీనాథ్‌శెట్టి సిబ్బంది ఓబున్న పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని అప్పలాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో, మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాలలో ఉదయాన్నే పంచామృతాభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

ఘనంగా కైలాస వాహనోత్సవం


రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 20: పట్టణంలోని జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా శనివారం కైలాస వాహనంలో స్వామివారిని ఊరేగింపు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ప్రతిష్ఠించి నేసేపేట, బళ్లారి బస్టాండ్, వినాయకసర్కిల్, పాత బస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వరకు ఊరేగింపు సాగింది. మంగళవారం స్వామివారి బ్రహ్మోత్సవంలో భాగంగా బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు



కైలాస వాహనంలో ఊరేగిన స్వామివారు

నెమలి వాహనంపై సంగమేశ్వరుడు

కూడేరు, ఏప్రిల్ 20: ప్రసిద్ధి చెందిన జోడులింగాల సంగమేశ్వర స్వామి శనివారం వైశ్య సంఘం ఆధ్వర్యంలో నెమలి వాహనంపై స్వామి వారు విహరించారు. వైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా తయారు చేయించిన నెమలి వాహనాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో అర్చకులు రుద్రాభిషేకం నిర్వహించారు. శనివారం రాత్రి సంగమ్మ, సంగప్పలను వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించంఆరు. భక్తులు స్వామివార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.66	1,576.69
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	112	244
సామర్థ్యం (టీఎంసీలు)	3.86	3.07

ఘనంగా మహంకాళమ్మ ప్రతిష్ఠాపన



బన్ని మహంకాళి దేవి

కంప్లి, ఏప్రిల్ 20 :కంప్లి పట్టణం సీపిరిదిన్నె బన్ని మహంకాళి దేవి ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠాపన సందర్భంగా శనివారం ప్రతిష్ఠాహోమాలు జరిగాయి. అన్నయనాన్ శాస్త్రి చేతుల మీదుగా పూజలు జరిపించారు. అమ్మవారికి జలాభిషేకం, అమృతాభిషేకం, కుంకుమార్చన, లలిత సహ స్రనామపూజ చేపట్టారు. కంప్లి పట్టణం చుట్టుపక్కల గ్రామాలు, క్యాంపుల నుంచి భక్తులు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.

బీజేపీ అభ్యర్థి కోసం మాజీ ఎమ్మెల్యే ప్రచారం



లోక్‌సభ అభ్యర్థి గెలుపుకోసం మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి ప్రచారం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 20: బళ్లారి నగరంలో 10వ వార్డు మర్రిస్వామి మఠం, రాణితోట, పలు ఏరియాల్లో శనివారం బళ్లారి సిటీ మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి నగరంలో ప్రచారం చేపట్టారు. నగరంలో మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి విస్తృత ప్రచారం చేపట్టి దేశ ప్రధాని మోదీ చేసిన అభివృద్ధిని చూసి కమలం గుర్తు ఓటు వేసి లోక్‌సభ అభ్యర్థి శ్రీరాములును గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఎస్ మహదేవయ్య, శ్రీనివాస్, మహానగర పాలిక సభ్యులు మోత్కూరు శ్రీనివాస్, ఏపీఎంసీ మాజీ అధ్యక్షులు ఉమేష్, నాగేష్, ఎర్రగుడి మల్లికార్జున, రాజుతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి..



బీజేపీ తీర్థం పుచ్చుకున్న గుర్రం శ్రీనివాస్

బళ్లారిరూరల్, ఏప్రిల్ 20 : బళ్లారి లోక్‌సభ అభ్యర్థి శ్రీరాములు నివాసంలో శనివారం కాంగ్రెస్ ప్రముఖులు గుర్రం శ్రీనివాస్ వంద మంది యువకులతో పాటు కలసి శ్రీరాములు నివాసంలో బీజేపీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థి శ్రీరాములు గుర్రం శ్రీనివాస్‌కు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గుర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ తనవంతుగా తమ యువకులతో కలసి పెద్దఎత్తున కష్టపడి మాజీ మంత్రి, లోక్‌సభ బీజేపీ అభ్యర్థి శ్రీరాములు గెలుపుకు మా వంతు కృషితో పనిచేసి గెలిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్, కిరణ్, పట్టాభిరామ్, ఇమామ్, ఆరోగ్యరాజ్, మహేష్‌తో పాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన

సిరుగుప్ప, ఏప్రిల్ 20: ప్రజాప్రభుత్వ వ్యవస్థలో ఓటు హక్కు వేయడం మన హక్కని హెడ్ పోస్టుమాస్టర్ మంజునాథశెట్టి తెలిపారు. శనివారం సిరుగుప్ప పట్టణం హెడ్ పోస్టుకార్యాలయం ముందు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మంజునాథ మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా సరియైన అభ్యర్థులను ఎన్నుకోవాలన్నారు.

విద్యార్థిని హత్యపై ముస్లింల నిరసన

హుబ్బళ్లి విద్యార్థిని నేహా హత్యపై జిల్లావ్యాప్తంగా నిరసన పెల్లుబికింది. ఆశ్చర్యకరంగా సిరుగుప్పలో ముస్లిం వర్గీయులే ముందుకొచ్చి ఈ హత్యను ఖండించడం గమనార్హం.

సిరుగుప్ప, ఏప్రిల్ 20 : హుబ్బళ్లి విద్యార్థిని నేహాను హత్య చేసిన ఫయాజ్‌ను కఠినంగా శిక్షించాలని ముస్లిం ప్రముఖ నాయకులు సౌదీ హరున్ సాబ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సిరుగుప్ప తహసీల్దార్ షంషాలంకు శనివారం వారు వినతిపత్రాన్ని అందజేశారు. హుబ్బళ్లి ధార్వాడ కళాశాలలో జరిగిన యువతి హత్యను ఖండిస్తూ ఫయాజ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. యువతి పై దౌర్జన్యం చేసి మారణాయుధంతో దాడి జరిపి హత్య చేసిన యువకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం ప్రముఖులు సౌదీ ఖాజాసాబ్, హోటల్ గఫూర్, అండీ హుసేన్ సాబ్, నబీసాబ్, జిలానీ, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ షంషాలంకు వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు

విద్యార్థిని హత్యపై ఏబీవీపీ ఆందోళన



బళ్లారి నడిబొడ్డున గడిగిచెన్నప్ప సర్కిల్లో ఏబీవీపీ విద్యార్థుల నిరసన

బళ్లారి సిటీ. ఏప్రిల్ 20: పట్టపగలే హుబ్బళ్లి బీవీబీ కళాశాలలో విద్యార్థినిని హత్య చేసిన యువకుడిని కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ శనివారం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి ఏబీవీపీ రాష్ట్ర సహకార్యదర్శి వినోద్ మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలలు విజ్ఞాన దేవాలయాలని అలాంటి దేవాలయంలో పట్టపగలే విద్యార్థిని నేహా హిరేమఠ్ దారుణ హత్యకు గురైన ఘటన విద్యార్థి లోకంలో భయానక వాతావరణాన్ని సృష్టించిందన్నారు. బీవీబీ కళాశాలలో ఎంసీఏ చదువుతున్న విద్యార్థి నేహా హిరేమఠ్‌ను లవ్ జిహాదీ కోసం ప్రేమలో పడాల్సిందిగా ఒత్తిడి తెచ్చారన్నారు. ఈ ప్రేమను తిరస్కరించినందుకు, ఆ విద్యార్థినిని కళాశాలలో అనాగరికంగా కత్తితో మెడపై తొమ్మిది సార్లు పొడిచి హత్య చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పోలీసులు పాఠశాలలు, కళశాలలకు సమీపంలో పని చేయాలన్నారు. రోజురోజుకు దిగజారుతున్న శాంతి భద్రతలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియ"స్‌గా ఆలోచించి చర్యలు తీసుకోవాలన్నారు. చట్టభయం లేనప్పుడే ఇలాంటి ఘటనలు జరుగుతాయన్నారు. ఈ కేసు దర్యాప్తును వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ నిరసనలో భారీసంఖ్యలో ఏబీవీపీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినిని హతమార్చిన యువకుడిని కఠినంగా శిక్షించండి

కంప్లి: హుబ్బళ్లిలో విద్యార్థినిని అమానుషంగా కత్తితో పొడిచి హతమార్చిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలు కంప్లి పట్టణంలో నిరసన తెలిపారు. హుబ్లి కళాశాల క్యాంపస్‌లో ఎంసీఏ విద్యార్థిని నేహా హిరేమఠ్ (25)ను అందరూ చూస్తుండగానే ఫయాజ్ అనే యువకుడు హతమార్చడం రాష్ట్రంలో సంచలనం రేపిందని, కళ్లెదుటే ఘోరాలు జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. నేహాను హతమార్చిన ఫయాజ్‌ను ఉరితీయాలని కోరారు. బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు దీప, బీజేపీ అధ్యక్షులు హళ్లి వీరేష్ మాట్లాడుతూ.. మహిళలపై ఎన్నో అత్యాచారాలు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం వారికే మద్దతు ఇవ్వడం సరికాదన్నారు. అంతకుముందు ఉద్భవ గణపతి ఆలయం వద్ద నుంచి అంబేద్కర్ సర్కిల్ కూడలి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో దమ్మయ్య, సిద్దప్ప, ఉష, రబియానా, సీఆర్ హనుమంతు, లక్ష్మీకాంతరెడ్డి, దేవేంద్ర, రామన్న, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, రామాంజినేయులు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కంప్లి అంబేడ్కర్ కూడలిలో నిరసన చేపడుతున్న బీజేపీ కార్యకర్తలు

ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి

● ఎన్నికల పరిశీలకుడు చంద్రశేఖర్ శఖమురి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు చంద్రశేఖర్ శఖమురి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 20: ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి అధికారులతో సహా వివిధ బృందాలు సమన్వయంతో పనిచేయాలని బళ్లారి లోక్‌సభ ఎన్నికల సాధారణ పరిశీలకుడు చంద్రశేఖర్ శఖమురి పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి సహాయ రిటర్నింగ్ అధికారులు, వివిధ కమిటీల నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల అధికారులందరూ శిక్షణ పొంది సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని సన్నాహాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇంకా తగినంత సమయం ఉందని, ఈవిషయమై సహాయ ఎన్నికల అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమివ్వండి..

జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా వృద్ధులకు వికలాంగులకు లైటింగ్ నీడ తాగునీరు మరుగుదొడ్ల వ్యవస్థ, ర్యాంప్, వీల్ చైర్ తదితర మౌలిక సదుపాయాలు అమలు చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఆయా రంగాల ఏఆర్‌ఓలు మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. ఎన్నికల అక్రమాలపై నిఘా పెట్టాలన్నారు. అదేవిధంగా ఇతర కమిటీలు కూడా క్రియాశీలకంగా మారాలన్నారు. ఎన్నికల అక్రమాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది వాహనాలను కేవలం సాకుతో తనిఖీలు చేయడం సరికాదన్నారు.

జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. బళ్లారి లోక్‌సభ నియోకవర్గంలో ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలను వివరించారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ బండారు మాట్లాడుతూ ఎంసీసీ ఉల్లంఘనకు సంబంధించి ఇప్పటి వరకు మొత్తం 25కేసులు నమోదు చేశారని, అధికారుల నుంచి నివేదికలు అందిన తర్వాత సున్నితమైన సాధారణ పోలింగ్ బూత్‌లను గుర్తించినట్లు తెలిపారు.

జిల్లాస్వీప్ నోడల్ అధికారి ,జిల్లాపంచాయితీ సీఈఓ రాహుల్ శరణప్ప మాట్లాడుతూ గత లోక్‌సభ ఎన్నికల్లో 63.05 శాతం పోలింగ్ నమోదైందన్నారు. ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లా, తాలూకా, గ్రామస్థాయిల్లో ఏ ఓటర్లకు ఓటు ప్రాదాన్యతపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బళ్లారిలోక్‌సభ ఎన్నికల వ్యయ పరిశీలకులు కే. కృష్ణమూర్తి, సరేంద్రపాల్, వివిధ నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారులు, వివిధ కమిటీల నోడల్ అధికారులు, జిల్లా ఎన్నికల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు డిమాండ్



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కంప్లి, ఏప్రిల్ 20: కురుగోడు తాలుకాలో ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించిన జొన్న ధాన్యం కొనుగోలు చేయాలని ఏఐకేకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రేణుకకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐకేకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు గోవిందు కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు. ప్రభుత్వం మాత్రం రైతులు పండించిన జొన్నలను ఆ తాలుకా పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని ఆదేశాలను జారీ చేసినా అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికీ కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడం విడ్డూరంగా వుందన్నారు.

మొక్కజొన్న కొనుగోలు చేయాలి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 20: మొక్కజొన్న కొనుగోలు వెంటనే ప్రారంభించాలని ఏఐకే కేఎంఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో కురుగోడు తాహసిల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా సంస్థ అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కనీస మద్దతు ధర పథకం కింద రైతుల నుంచి మొక్కజొన్న కొనుగోలు ప్రకియ మందగించడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. రైతులు పండించిన మొక్కజొన్నను జనవరిలో కొనగోలు చేయాల్సి ఉండగా ఇంతవరకు ప్రక్రియ ప్రారంభించలేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఓ జేబుదొంగ

● ఒకరి నుంచి లాక్కొని మరొకరికి ఇవ్వడమే వారి పని: కుమారస్వామి



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న హెచ్‌డీ కుమారస్వామి

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 20: గ్యారెంటీల పేరుతో కుటుంబం పెద్ద నుంచి ప్రతి నెలా ఐదువేల నుంచి ఆరు వేల రూపాయిలు లాక్కొని అదే కుటుంబంలోని మహిళకు రెండు వేల రూపాయలు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసేపని అని, మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ పార్టీ అధినేత హెచ్.డి. కుమారస్వామి అన్నారు. ఇది పిక్‌పాకెట్ ప్రభుత్వమని కాంగ్రెస్ ప్రభుత్వానికి చురకలు అంటించారు. చిత్రదుర్గ జిల్లా హిరియూరు పట్టణంలోని నెహ్రూ మైదానంలో శుక్రవారం బీజేపీ, జేడీఎస్ పార్టీల ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. మద్యం ధర గతంలో రూ.25 నుంచి రూ.30 ఉండేదనీ, ప్రస్తుతం అది రూ.300కు చేరిందన్నారు. ప్రజల నుండి ప్రభుత్వం వసూళ్లకు పాల్పడుతోందని ఆరోపించారు. గ్యారెంటీ పథకాల ప్రకటనలకు ప్రతిరోజు రూ.10కోట్ల వరకు ఖర్చు చేస్తు న్నారని, ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.350కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. ఈ డబ్బు ప్రజల అభివృద్ధికి ఉపయోగించి ఉంటే బాగుండేదని కుమారస్వామి సలహా ఇచ్చారు. భద్రా మేల్దండ యోజన ప్రాజెక్ట్ 5 సంవత్సరాల్లో పూర్తి కావాల్సి ఉండేదని, అయితే 14 సంవత్సరాలు గడిచినా ఇంతవరకు పూర్తికాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పార్టీగా అధికారంలోకి రావడానికి ప్రజలను కోరానని, అయితే ఓటర్లు అవకాశం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ మతాల మధ్య చిచ్చురేపే పనికి పాల్పడుతోందని హెచ్చరించారు. రాష్ట్రంలో 28 నియోజకవర్గాల్లో తాము గెలుపొందుతామని, వచ్చే ఐదేళ్లలో కన్నడనాడును అభివృద్ధి పరుస్తామన్నారు. ఎన్నికలు ముగిసిన తరువాత కాడుగొల్లర్లను ఎస్టీ లోకి చేర్చేందుకు కృషిచేయనున్నట్లు చెప్పారు. మైత్రి అభ్యర్థి గోవింద కారజోళకు జిల్లా ప్రజలు తప్పకుండా ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో విధాన పరిషత్ సభ్యులు తిప్పేస్వామి, కెఎస్ నవీన్, మాజీ ఎమ్మెల్యే జి.హెచ్.తిప్పారెడ్డి, పావగడ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, ఎం.రవీంద్రప్ప, చలవాది నారాయణస్వామి, సిద్దార్థ డి.యశోదర, ఎం.జయణ్ణ కాంతరాజు, ఎ. మురళి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రధాని సంక్షేమ పథకాలతోనే బీజేపీ గెలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప, ఏప్రిల్ 20 : పదేళ్లలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి బీజేపీ అభ్యర్థి డాక్టర్ బసవరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప బీజేపీ కార్యకర్తలను కోరారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సిరుగుప్ప పట్టణం బీజేపీ కార్యాలయంలో శనివారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సోమలింగప్ప మాట్లాడుతూ దేశ ప్రధాని పదేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని వాటిని ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలు పాకిస్తాన్ కు జేజేలు కొట్టినట్లు అవుతుందని ఆయన విమర్శించారు. 400 స్థానాల్లో బీజేపీ విజయభేరి మోగిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షులు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి, ప్రధాన కార్యదర్శి బసవరాజు, నాగరాజ, మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు ధరప్ప నాయక, ఎంఆర్ గౌడ, ఈరణ్ణ గౌడ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగుల నుంచి రక్షణకు చర్యలు తీసుకోవాలి



డాక్టర్ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 20: అకాల వర్షాకాలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాటి నుంచి రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు సూచించారు. సాధారణంగా మేనెలలో ఈదురు గాలులు వీస్తాయని, ఈ నేపథ్యంలో ప్రాణనష్టాన్ని నివారించాలని, బహిరంగ ప్రాంతాలలో చెట్ల కింద, షెడ్‌లలో ఆశ్రయం తీసుకోకుండా అనువైన ప్రదేశాల్లో ఉండాలని ఆయన కోరారు. విపత్తు నుండి బయటపడేందుకు జిల్లా విపత్తు నిర్వహణ అధారిటీ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఎప్పటికప్పుడు అందజేసే మార్గదర్శకాలను పాటించాలని ఆయన కోరారు. పిడుగులు పడతాయని తెలిసినప్పుడు సమీపంలోని లోతట్టు ప్రాంతానికి వెళ్లి కూర్చోవాల న్నారు. మెదడు, గుండెకు మెరుపుదెబ్బ తగలకుండా ఉండటానికి బహిరంగ ప్రదేశంలో ఉంటే తలను మోకాళ్ల మధ్య ఉంచుకుని కూర్చోవాలన్నారు. ఆటవీ ప్రాంతంలో ఉన్నట్లయితే త్వరగా బయటకు వెళ్లడం మంచిదని, ఎందుకంటే మెరుపు మేఘం నుండి భూమికి ప్రవహించడానికి కలప వంటి ముడి తడి పదార్థాలను ఎంచుకుంటుందన్నారు. ఎత్తైన కొండపై ఉంటే దిగువకు వెళ్లాలని, గొర్రెలు లేదా పశువుల మధ్య నిలబడి ఉంటే వాటి మధ్య కూర్చోవాలన్నారు. సరస్సులో స్నానం చేయరాదని, నీటిలో ఉంటే వెంటనే బయటకు రావాలన్నారు. విద్యుత్ స్తంభం, మొబైల్ టవర్, ట్రాన్స్‌ఫార్మర్ మొదలైన వాటికి సమీపంలో ఉండకూడదన్నారు. కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. పిడుగుపాటుకు గురైన వ్యక్తులు రాగానే తక్షణ చికిత్స చర్యలు చేపట్టి వైద్యాధికారులకు సమాచారం అందించాలన్నారు. అవసరమైన ముందులను స్టాక్‌లో ఉంచినట్లు డిహెచ్‌ఓ డాక్టర్ రమేశ్‌బాబు తెలిపారు

హోసూరు జోన్

స్ట్రాంగ్‌రూంలకు చేరిన ఈవీఎంలు



స్ట్రాంగ్ రూంకు సీల్ వేస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు, ఏప్రిల్ 20: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో కృష్ణగిరి నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు చేరుకున్నాయి. ప్రభుత్వ సాంకేతిక కళాశాల ఆవరణలో ఏర్పాటైన ఈ స్ట్రాంగ్ రూంకు మొత్తం 322 మంది సీఆర్‌పీఎఫ్, పోలీసులు 3 షిఫ్ట్‌లలో బందోబస్తు ఉంటారని జిల్లా ఎన్నికల అధికారి కె.ఎం.సరయు తెలిపారు. 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1888 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ జరిగింది. ఎన్నికల పరిశీలకులు కిరణ్ కుమారి బాసి ఆధ్వర్యంలో శనివారం అభ్యర్థులు, ఏజెంట్లు సమక్షంలో స్ట్రాంగ్ రూంలో ఈవీయంలను భద్రపరిచి సీల్ వేశారు. స్ట్రాంగ్ రూం వద్ద 24 గంటలూ పర్యవేక్షించేలా చుట్టుపక్కల భారీగా నిఘా కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే నిఘా కెమెరాల రికార్డింగ్‌కు సంబంధించి ఎల్ఈడీ, టీవి స్క్రీన్‌లను పరిశీలించారు. అలాగే రాత్రిపూట సరిపడా లైటింగ్ ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో 4 జనరేటర్లను ఉంచి ఒక్కో షిఫ్టుకు 12 మంది చొప్పున పర్యవేక్షిస్తున్నారు. ఎలక్ట్రిటీ బోర్డు తరఫున షిఫ్టుకు నలుగురు పనిచేయనున్నారు. సీఆర్‌పీఎఫ్ 24 మంది, తమిళనాడు స్పెషల్ పోలీస్‌లు 45 మంది, స్థానిక పోలీసులు నుంచి 253 మంది 3 షిప్టులలో పనిచేయనున్నారు. ఒక డీఎస్పీ, ముగ్గుర సీఐలు పర్యవేక్షిస్తారని కలెక్టర్ సరయు వివరించారు.

పెరిగిన పూల ధరలు

హోసూరు, ఏప్రిల్ 20: హోసూరు, డెంకణీకోట, తళి ప్రాంతాల్లో భారీ ప్రమాణంలో రైతులు బంతిపూలు, గులాబీలు పండిస్తున్నారు. స్థానికంగా పండించిన పూలను ప్రధానంగా హోసూరు పూల మార్కెట్‌లో విక్రయిస్తారు. ఇక్కడి నుంచి తమిళనాడులోని పలు ప్రాంతాలతోపాటు సరిహద్దున ఉండే కర్ణాటక రాజధాని బెంగళూరుకు ఎగుమతి చేస్తారు. తెలుగు, తమిళ సంవత్సరాది, శ్రీరామనమి సందర్భంగా పూలధరలు పెరగడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. శనివారం హోసూరు మార్కెట్‌లో 300 టన్నుల పూలు అమ్ముడుపోయాయి. వేసవికి ముందు 500 టన్నులు పూలు వచ్చేవి. గత కొద్ది రోజులుగా బోరుబావులు ఎండిపోవడంతో పంట దిగుబడి దాదాపు సగానికి పడిపోయింది. కిలో బంతిపూలు రూ.360 పలికింది. గులాబీ రూ.140, గుండుమల్లెలు రూ.400, చెండుమల్లి రూ.80 చొప్పున విక్రయించారు. సంపంగి రూ.300, అరళి రూ.400 పలికింది. పూల దిగుబడి తగ్గినా ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.



మార్కెట్‌లో పూల విక్రయాలు

రాయచూరులో రెండు నామినేషన్‌ల తిరస్కరణ..!



నామినేషన్ తిరస్కరణకు గురైన మాజీ ఎంపీ బీవీ నాయక్ (ఫైల్)



రాయచూరు పార్లమెంటరీ నియోజకవర్గం (ఫైల్)

రాయచూరు, ఏప్రిల్ 20 : లోకసభ ఎన్నికల సందర్భంగా రాయచూరు స్థానానికి దాఖలైన నామినేషన్‌లలో రెండు నామినేషన్‌లు తిరస్కరణకు గురైయ్యాయి. శనివారం నిర్వహించిన నామినేషన్‌ల పరిశీలనలో బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన బీవీ నాయక్ అభ్యర్థిత్వాన్ని అధికారులు తిరస్కరించారు. బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన బీవీ నాయక్ ఆ పార్టీకి సంబంధించిన బీ ఫారం సమర్పించకపోవడంతో పాటు నామినేషన్ సందర్భంగా స్వయంగా హాజరై ప్రమాణ స్వీకారం చేయకపోవడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు అధికారులు ప్రకటించారు. ఆయనతో పాటు మరో అభ్యర్థి శ్యామ రావ్ మేధార్ నామినేషన్ కూడా తిరస్కరణకు గురైంది. తిరస్కరణకు గురైన శ్యామరావ్ మేధార్ మరో సెట్టు నామినేషన్‌ను అధికారులు అనుమతించారు. దీంతో మొత్తం 11 మంది అభ్యర్థులు 21 సెట్ల నామినేషన్‌లు వేయగా 19 సెట్‌ల నామినేషన్‌లను అధికారులు స్వీకరించారు. దీంతో రంగంలో 10 మంది అభ్యర్థులు మిగిలారు. నామినేషన్‌ల ఉపసంహరణకు సోమవారం తుది గడువు కావడంతో అనంతరమే అభ్యర్థులు ఎంత మంది అన్నదానిపై స్పష్టత రానుంది. కాగా కుల వివాదానికి సంబంధించి హైకోర్టులో విచారణను ఈ నెల 22కు వాయిదా వేశారు.

బీజేపీ అభ్యర్థి నామినేషన్‌పై తొలగిన ఉత్కంఠ



రాజా అమరేశ్వర్ నాయక్

రాయచూరు, ఏప్రిల్ 20 : లోకసభ ఎన్నికల్లో రాయచూరు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజా అమరేశ్వర్ నాయక్ నామినేషన్ పై వివాదం సద్దుతొలిగిపోయింది. ఆయన కులధ్రువీకరణకు సంబంధించి కరడదొడ్డికి చెందిన నరసింహలు నాయక్ గులబర్గా హైకోర్టులో వ్యాజ్యం వేయగా దాని పై విచారణ చేపట్టిన న్యాయస్థానం 22వ తేదీన తుది తీర్పు ఇచ్చేందుకు నిర్ణయించింది. ఈ క్రమంలో ఈ నెల 19న మరో సారి విచారణ చేపట్టిన న్యాయస్థానం 22వ తేదీ వరకు తీర్పును వాయిదా వేయడంతో బీజేపీ అభ్యర్థి నామినేషన్ పరిశీలన సందర్భంగా కొంత గందరగోళం నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి జీ కుమార్ నాయక్ తరపున హాజరైన ఆ పార్టీ నాయకులు నామినేషన్‌ల పరిశీలన సందర్భంగా బీజేపీ అభ్యర్థి కుల వివాదానికి సంబంధించి న్యాయస్థానంలో వ్యాజ్యం ఉన్న విషయాన్ని రిటర్నింగ్ అధికారి దృష్టికి తెచ్చారు. ఇది తమ పరిధిలోని అంశం కాదని కోర్టు తీర్పుకు కట్టుబడి తమ నిర్ణయం ఉంటుందని ఆయన నామినేషన్‌ను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు.